ప్రజాశక్తి
గురువారం 30 అక్టోబర్ 2025 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

కన్నీరు





- అన్నదాతకు అపారనష్టం ● 1.54 లక్షల హెక్టార్లలో వరికి నష్టం
- దెబ్బతిన్న అరటి, బొప్పాయి, ఇతర పంటలు ● విరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు
- స్తంభించిన జనజీవనం ● ఎట్టకేలకు విద్యుత్ సరఫరా, బస్సుల పునరుద్ధరణ

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ప్రకతి పరిహాసంతో అన్నదాత కుదేలవుతున్నాడు. రైతులపై ప్రకతి కన్నెర్ర చేయడం సర్వసాధారణంగా మారింది. పంటచేతికొచ్చే వరకూ దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్న చందంగా మారింది. ఆరుగాలం కష్టపడి పండించిన 15 నుంచి 30 రోజుల్లో చేతికి అందివస్తుందనుకున్న పంటలు ఈదురుగాలు, వర్షాలకు నేలవాలాయి. ఆరుగాలం కష్టించి వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన పంటలు దెబ్బతినడంతో అన్నదాతలను కలచివేస్తోంది. పెట్టిన పెట్టుబడులు చేతికి తిరిగి రావని, అప్పులే మిగులుతాయని ఆందోళన చెందుతున్నారు. మొంథా తుపాను అన్నదాతలను నిట్టనిలువునా ముంచింది. నేలవాలిన పంటలనుచూసి కన్నీరు మున్నీరవుతున్నారు. తుపాను ప్రభావంతో జిల్లావ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. భారీగా వీచిన ఈదురుగాలులతో వరి పొలాలు నేలవాలాయి. అరటి, బొప్పాయి తోటలు దెబ్బతిన్నాయి. జిల్లాలో 1.54 లక్షల హెక్టార్లలో వరి సాగు చేశారు. ఆలస్యంగా వరినాట్లు వేసిన పొలాల్లో పైరు పొట్టదశ, ముందస్తుగా నాట్లు పూర్తి చేసిన పొలాల్లో ఈత దశ, కంకులు పాలుపోసుకునే దశ, మరికొన్ని చోట్ల కోత దశలో ఉంది. ఈనేపథ్యంలో భారీ వర్షాలకుతోడు బలమైన గాలులు వీయడంతో వరి పంట నేల వాలింది. కోడూరు, కంకిపాడు, మచిలీపట్నం, పామర్రు, మొవ్వ తదితర ప్రాంతాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి నేలవాలి నీటిలో నానుతోంది. బిపిటి 5204, ఎంటియు 1061 రకాలు వరి సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఈ రకాల సాగుచేసిన పంటలు 50 శాతం కూడా దిగుబడి వచ్చే అవకాశం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి పనలు పడిపోవడం వల్ల యంత్రాలతో కోయడానికి అవకాశం లేదని చెబుతున్నారు. దీనివల్ల మరో రూ.10 వేలు అదనంగా రైతులపై భారం పడుతుందని (మిగతా 2లో)



మునేరు వరద ఉధృతిపై సమీక్ష

కీసర వద్ద పరిశీలించి కలెక్టర్, సిపి, ఎంఎల్ఎ

ప్రజాశక్తి - కంచికచర్ల : ఎగువ ప్రాంతాల నుంచి మునేరుకు వరద ప్రవాహం వస్తున్న నేపథ్యంలో బుధవారం రాత్రి ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు, నందిగామ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య మండలంలోని కీసర బ్రిడ్జి వద్ద వరద ఉధతిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఐతవరం - అంబారుపేట వద్ద జాతీయ రహదారిపై పరిస్థితిని కూడా సమీక్షించారు. వరద నీరు రహదారిపైకి ప్రవేశించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ బాలకృష్ణ, ఏసిపీ తిలక్, నందిగామ రూరల్ సిఐ చవాన్, తహశీల్దార్ నరశింహారావు పాల్గొన్నారు.



విద్యుత్ వ్యవస్థ తీవ్రనష్టం : మంత్రి గొట్టిపాటి

మొంథా తుపాను ప్రభావంతో ఈదురు గాలులకు విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిందని ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి ఆయన బుధవారం మచిలీపట్నంలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మీడియాతో మాట్లాడుతూ దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టామని వెల్లడించారు. ప్రాణ, ఆస్తి నష్టం నివారణకే విద్యుత్ సరఫరాను ముందస్తుగా నిలిపి వేశామని తెలిపారు. ఈదురు గాలులకు పెద్దఎత్తున విద్యుత్ స్తంభాలు పడిపోయన్నారు.



సిపిఎం, రైతు, కౌలు రైతు సంఘాల నేతల పర్యటన

కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో ముంపునకు గురైన పంటలను సిపిఎం, రైతు, కౌలు రైతు సంఘాల నేతలు బుధవారం పరిశీలించారు. అలాగే పునరావాస కేంద్రాల్లోని బాధితులను పరామర్శించారు. ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు విజయవాడ అజిత్ సింగ్‌నగర్, ఎల్బీఎస్ నగర్, పటేల్ నగర్, సుందరయ్య నగర్, రాజీవ్ నగర్ తదితర ప్రాంతాల్లో విస్తతంగా పర్యటించారు. పునరావాస కేంద్రాలను పరిశీలించారు. గత ఏడాది సంభవించిన బుడమేరు వరద బాధితులకు ఇప్పటికైనా సాయం అదించాలని, ముంపు నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని బాబురావు డిమాండ్ చేశారు. అలాగే కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలంలో దెబ్బతిన్న పంటలను ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు పరిశీలించారు. పంట నష్టాలను అంచనా వేసి బాధిత రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



విజయవాడలో బాధితులను పరామర్శిస్తున్న బాబురావు



తోట్లవల్లూరు మండలంలో దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న ఎం.హరిబాబు, రంగారావు తదితరులు



ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

మొంథా తుపాను ప్రభావంతో ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. విజయవాడలో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు చోట్ల రహదారులపై వరద నీరు చేరింది. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జోరువానలకు పలువాగులు ఉధృతంగా ప్రవహరిస్తున్నాయి. ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ సమీపంలో నల్లవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో నందిగామ – చందర్లపాడు ఆర్అండ్‌బి రహదారిపై వరద నీరు ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వాగు పరిసర ప్రాంతాల్లోని పంటపొలాల్లో వరి పైర్లు దెబ్బతిన్నాయి. కంచికచర్ల– గొట్టుముక్కల రహదారిలో వరద నీరు నిలిచింది. ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లిలో సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్‌ను రైల్వే అధికారులు నిలిపివేశారు.

బ్యారేజీకి వరద తాకిడి

- సముద్రంలోకి 1,00,573 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నదికి వరద తాకిడి పెరిగింది. మొంథా తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తూ కృష్ణా నదిలోకి చేరుతున్నాయి. దీంతో బ్యారేజీ నుంచి 1,00,573 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ 70 గేట్లలో ఒక గేటు సాంకేతిక లోపం కారణంగా మూసివేశారు. ఇక మిగిలిన 69 గేట్లలో 20 గేట్లు మూడడుగులు, 49 గేట్లు రెండడుగుల మేర ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. ప్రకాశం బ్యారేజీ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 12 అడుగులు కాగా, ప్రస్తుతం 10.5 అడుగుల మేర నీటి ప్రవాహం కొనసాగుతోంది. కష్ణా డెల్టాలోని అన్ని పంట కాల్వలకు నీటి విడుదలను నిలిపివేశారు. పులిచింతల నుండి 57,196 క్యూసెక్కులు, పాలేరు నుండి 24,196 క్యూసెక్కులు, కీసర (మునేరు) నుండి 5,845 క్యూసెక్కుల వరద ప్రవాహం కృష్ణా నదికి కొనసాగుతోంది.



ప్రభుత్వ సాయం ఇవ్వకుండా

శిబిరాల నుండి పంపడం సరికాదు

సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి : తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఉన్న పేదలందరికీ ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఆర్థిక సహాయం, బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేయాలని సిపిఎం కష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు డిమాండ్ చేశారు. ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... ప్రభుత్వం ప్రటించిన విధంగా మనిషికి వెయ్యి రూపాయల చొప్పున కుటుంబానికి గరిష్టంగా రూ.3 వేల చొప్పున నగదు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి కుటుంబానికి 25 కిలోల చొప్పున బియ్యం, మత్స్యకార కుటుంబాలకు 50 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేయాలని కోరారు. అలాగే కిలో చొప్పున నూనె, కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, పంచదార ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని గుర్తుచేశారు. శిబిరాలను నుండి వెళ్లేటప్పుడే వీటిని అందిస్తామని ప్రకటించారని పేర్కొన్నారు. కానీ ఇవేమీ ఇవ్వకుండానే పునరావాస కేంద్రాల్లోని బాధితులను బుధవారం ఇళ్లకు పంపివేశారని తెలిపారు. తుపాను తీరం దాటిన తర్వాత శిబిరాలను మూసివేశారని పేర్కొన్నారు. పునరావాస కేంద్రాలకు తరలించబడిన వారంతా కేవలం రెక్కలకష్టంతోనే బతికే వారని, ఏ పూటకాపూట డబ్బులు తెచ్చుకు తినేవారు, ఏ నీడా లేని ఎస్‌సి, ఎస్‌టి, బిసి తరగతులకు చెందిన వారని నరసింహారావు పేర్కొన్నారు. కానీ ఏ సహాయం చేయకుండానే సహాయ శిబిరాలను మూసివేసి బాధితులను ఇళ్లకు పంపడంతో ఏ ఆసరా లేని పేదకుటుంబాల వారు ఏ ఆదాయం లేక పస్తులుండాల్సి వస్తుందని పేర్కొన్నారు. వచ్చే ఐదారు రోజుల వరకు ఏ పనులకు వెళ్లే అవకాశం కూడా లేదని, అందువల్ల జిల్లా అధికార యంత్రాంగం వెంటనే స్పందించి బాధితులకు ప్రకటించిన ఆర్థిక సహాయం, బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలను రక్షించేందుకు చర్యలు తీసుకున్న జిల్లా అధికార యంత్రాంగాన్ని అభినందించారు.

'కార్టూన్ల ద్వారా తెలుగు వికాసం' పోటీ విజేతల ప్రకటన

గుంటూరు : ఎపి ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యాన అమరావతి - గుంటూరు హైవేలోని శ్రీ సత్య సాయి స్పిరిచువల్ సిటీలో వచ్చే ఏడాది జనవరి 3, 4, 5 తేదీల్లో నిర్వహించనున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభ సన్నాహాల్లో భాగంగా నిర్వహించిన 'కార్టూన్ల ద్వారా తెలుగు వికాసం' పోటీల విజేతలను పరిషత్తు అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ప్రకటించారు. విజేతలకు జనవరి 3వ తేదీ సాయంత్రం 5 గంటలకు ప్రపంచ తెలుగు మహాసభ ప్రధాన వేదికపై ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. పోటీ సమన్వయకర్తగా కార్టూనిస్ట్ హరి వ్యవహరించినట్లు తెలిపారు. ఎంపికైన ఉత్తమ కార్టూన్లను మహాసభ ఆవరణలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ప్రథమ బహుమతి రామ్ శేషు (నెల్లూరు), ద్వితీయ బహుమతి సునీల్ (అమలాపురం), తతీయ బహుమతి సరసి (హైదరాబాద్)కు లభించినట్లు తెలిపారు. ప్రోత్సాహక బహుమతులు బొమ్మన్ (విజయవాడ), పర్శి నాయుడు (మన్యం జిల్లా), కోరాడ రాంబాబు (విశాఖపట్నం) పొందినట్లు పేర్కొన్నారు.

జాతీయ బధిర క్రికెట్ పోటీలకు నదియా, నాగూర్, అవినాష్ ఎంపిక



ప్రజాశక్తి - విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడకు చెందిన యశ్వంత్ నదియా (కెప్టెన్), అవినాష్ (బౌలర్), ఇబ్రహీంపట్నంనకు చెందిన క్రికెటర్ ఎమ్‌డి.నాగూర్ (ఆల్ రౌండర్) నవంబర్ 3 నుండి 9వ తేదీ వరకు ఇండియన్ డెఫ్ క్రికెట్ అసోసియేషన్ (ఐడిసిఎ) ఆధ్వర్యాన న్యూఢిల్లీలో జరిగే 9వ జాతీయ బధిర క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ బధిర క్రికెట్ అసోసియేషన్ తరపున వారు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ టోర్నీలో దేశంలోని అగ్రశ్రేణి బధిర క్రికెటర్లు టి 20 మ్యాచ్‌ల్లో పాల్గొంటారు. ఈ మేరకు ఎపి బధిర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.గోపీనాథ్, సిహెచ్.రఘు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

అంబేద్కర్ స్మృతి వనం నిర్వహణపై నిర్లక్ష్యం వద్దు

సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఉప్పులేటి తారక ప్రసాద్

విజయవాడ : అంబేద్కర్ స్మృతి వనంలో పారి శుధ్య నిర్వహణ దారుణంగా ఉందని, వెంటనే చర్యలు తీసుకొని ఆవరణలో శుభ్రం చేయాలని ఇండియన్ అంబేద్కర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రాంగణాన్ని ప్రతి రోజూ శుభ్రం చేయించాలని, అందుకు సంబంధించి పారిశుధ్య కార్మికులను నియమించాలని ముఖ్యమంత్రికి విన్నవించారు. రాజ్యాంగ నిర్మాతకు గౌరవం ఇచ్చేవిధంగా చర్యలు ఉండాలని, అవమానించేలా ఉండకూడదని పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ వెంటనే స్పందించి కలెక్టర్ ద్వారా చర్యలు తీసుకోవాలని కోరారు. రూ.400 కోట్లతో నిర్మించిన 125 అడుగుల అంబేద్కర్ స్మృతి వనాన్ని సక్రమంగా నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వదిలివేయడం సరికాదని పేర్కొన్నారు. ఇంకా స్మృతివనంలో పూర్తి చేయాలని అంబేద్కర్ కన్వెన్షన్ సెంటర్‌ను కూడా వీలైనంత త్వరగా నిర్మించాలని తారకప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

పునరావాస కేంద్రానికి తరలింపు



విజయవాడ : మొంథా తుపాను నేపథ్యంలో కరకట్ట వద్ద కొన్ని చెట్టు ఇళ్లపై పడడంతో రామలింగేశ్వర నగర్ కరకట్టకు చెందిన పలువురిని పునరావాస కేంద్రాలకు తరలించారు. మరికొంత మంది బాధితులనూ పునరావాస కేంద్రానికి తరలించారు. ఇళ్లు, రోడ్లపై పడిన చెట్లకు జెసిబిలు, ట్రాక్టర్ల సాయంతో తొలగించారు. ఈ కార్యక్రమంలో టిడిపి 18వ డివిజన్ నాయకులు గోగుల ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సినీ సంగీత వారోత్సవాలు



విజయవాడ : మహానటి సావిత్రి సాహిత్య సాంస్కృతిక కళాపీఠం సంక్షేమ సంఘం- వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ పరుచూరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కౌతా పూర్ణానందం కళావేదికపై బుధవారం రాత్రి సినీ సంగీత విభావరి జరిగింది. 94 సంవత్సరాల తెలుగు సినిమా వేడుకల్లో భాగంగా వారం రోజులపాటు రోజూ ఓ సాంస్కతిక సంఘం ఆధ్వర్యంలో సంగీత విభావరి జరిగింది. ముగింపు కార్యక్రమంలో గాయనీ గాయకులు వడ్డాది కామేశ్వరి, విష్ణుప్రియ, రాజ్ కిషోర్, రసూల్ బాబు, బొబ్బిలి మల్లేశ్వరి, ఎ.జయప్రభు, శ్యాంప్రసాద్, హేమమాలిని తదితరులు వివిధ చలనచిత్రాల్లోని పాటలను అలవోకగా ఆలపించి ప్రేక్షకుల్ని ఆనందపరిచారు. కార్యక్రమాన్ని ప్రిన్స్, చిట్టిబాబు, డేవిడ్ రాజు తదితరులు సమన్వయపరిచారు. నరేష్ సౌండ్స్ కార్యక్రమం విజయవంతంలో పాలుపంచుకుంది. ఈ వేడుకల్లో ప్రధానంగా తెలుగు సినిమా వైభవానికి సంబంధించి అపూర్వ ఛాయాచిత్ర ప్రదర్శనఏర్పాటు హైలైట్‌గా చెప్పుకోవచ్చు.

గ్రాండ్ మ్యూజికల్ నైట్



విజయవాడ : అలనాటి మేటి చలనచిత్ర నాయ కుడు ఎన్టీ రామారావు సూపర్ డూపర్ హిట్ 'సర్దార్ పాపా రాయుడు' సినిమాకు 45 సంవత్సరాలు నిండిన సందర్భంగా ఎన్టీఆర్ ప్రణవి మ్యూజికల్ అకాడమీ వారు బుధవారం రాత్రి గాంధీనగర్ ఆశిష్ స్టూడియోలో గ్రాండ్ మ్యూజికల్ నైట్ నిర్వహించారు. ఔత్సాహిక గాయనీ గాయకులు కారుమంచి రాజు (టీమ్ లీడర్), జయంతి చక్రవర్తి, మేకల పురుషోత్తమ ప్రసాద్, మాల్యాల వెంకటేష్, సుహాసిని, సుమలత, జి.మల్లేశ్వరి, అనిల్ కుమార్, బి.నెల్సన్ తదితరులు ఆలపించిన ఆయా చిత్రాల్లోని పాటలు ప్రేక్షకుల్ని అలరించాయి.



ముంపు ప్రాంతాల్లో రెడ్‌క్రాస్ సేవలు

టార్పాలిన్లు, దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ విశేష సేవలందిస్తోంది. విజయవాడ నగరంలోని పల్లపు ప్రాంతాల్లో నీటిముంపునకు గురైన కుటుంబాలకు బుధవారం రెడ్‌క్రాస్ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించింది. పూరిగుడిసెలు, రేకుల షెడ్డులో ఉంటున్న నిరుపేదలకు దుప్పట్లు, టవల్స్, టార్పాలిన్లు అందించింది. రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ చైర్మన్ డాక్టర్ జి.సమరం, వైస్ చైర్మన్ డాక్టర్ వెలగా జోషి, కార్యదర్శి చిట్టిబాబు, సభ్యులు బలరాం ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. నగరంలోని ముంపునకు గురైన వేరువేరు ప్రాంతాలను రెడ్‌క్రాస్ సొసైటీ కమిటీ విస్తతంగా పర్యటించింది. ఆయా ప్రాంతాల్లో నిరుపేదలకు అవసరమైన అంశాల గుర్తించి అధ్యయనం చేసింది. ఆటోనగర్ ప్రాంతంలోని పలు కుటుంబాలకు తార్పాలిన్లు, దుప్పట్లు, టవల్స్ ఉచితంగా పంపిణీ చేసింది.

మోదుమూడి సంగీత సేవ అద్భుతం



విజయవాడ : ప్రముఖ సంగీత విద్వాంసులు, మూడున్నర దశాబ్దాలకు పైగా నెలవారీ శాస్త్రీయ సంగీత గాన కచేరీల నిర్వహణలో ప్రత్యేక స్థానం కలిగిన సాంస్కతిక సంస్థ "స్వరఝరి" అధినేత 'కళారత్న' మోదుమూడి సుధాకర్ షష్టిపూర్తి సన్మాన కార్యక్రమం బుధవారం రాత్రి గాంధీనగర్ వి. హెచ్. గ్రంథాలయంలో ఘనంగా జరిగింది. నూరో సంవత్సరంలో సైతం వయోలిన్ కచేరీ అత్యద్భుతంగా నిర్వహించిన "సంగీత రుషి", "సంగీత సామ్రాజ్యానికి పెద్దదిక్కు" అని ఈ రంగ ప్రముఖులు, నిష్ణాతులు సైతం ఘనంగా చెప్పుకునే "పద్మశ్రీ" అన్నవరపు రామస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగీతాన్ని తెలుగు జాతి గర్వపడే స్థాయికి పెంచిన పారుపల్లి రామకష్ణయ్య పంతులు- శిష్యులకు సంగీతాన్ని వేదంలాగా వల్లె వేయించి- అనితర సాధ్యంగా ఎందరెందరికో సంగీత భిక్ష పెట్టారని.. ఆయన స్ఫూర్తితో మోదుమూడి సుధాకర్ చేస్తున్న సంగీత సేవ చిరకాలం గుర్తుండి పోతుందన్నారు. సన్మాన కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా "వాయులీన విద్వన్మణి" పాలపర్తి నాగేశ్వరరావు, "తాళావధాన పంచానన" కె. సద్గురుచరణ్, కవి, రచయిత, కళాకారుడు ధూళిపాళ్ల అమరేశ్వరశర్మ, ప్రముఖ సంగీత విద్వాంసురాలు సుధాకర్ సతీమణి అంజన కూడా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని బుర్రా నీలకంఠ శాస్త్రి నిర్వహించారు. తొలుత సాత్విక ప్రార్థనాగీతం ఆలపించారు. ఈ సందర్భంగా మూడు రోజులపాటు సుధాకర్ శిష్య బందం "గురు శిష్య ఆత్మీయ సంగీత సమ్మేళనం" పేరుతో నిర్వహించిన సంగీత కచేరీలు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి.

కన్నీరు

మొదటి పేజీ తరువాయి

చెబుతున్నారు. ఘంటసాల మండలం కొత్తపల్లి గ్రామంలో సాగవుతున్న 860 ఎకరాల ఆయకట్టులో అత్యధికంగా ఎంటియు 1061 సాగు చేశారు. సగటున ఎకరాకు రూ.26 వేలు పెట్టుబడి పెట్టారు. సాధారణ వాతావరణ పరిస్థితుల్లో ఎకరాకు 35 బస్తాల (75 కిలోలు) దిగుబడివస్తుంది. తుపానుకు 820 ఎకరాల్లో పంట నేలవాలింది. గింజ పాలు పోసుకునే దశలో నేలవాలడంతో సాధారణ దిగుబడులతో పోలిస్తే సగంలోపు అంటే 15 బస్తాలు దిగుబడి రావడం గగనమని బాధిత రైతులు వాపోతున్నారు. ఈమొత్తం దిగుబడులు వరి కోతలు, పన తిరగేయడం, కట్టేత, నూర్పిడికి ఖర్చయిపోతాయని, దుక్కులు, దుమ్ములు, గట్లు బాగు చేత, విత్తనాలు, నారుమళ్లు, నాట్లు, కలుపుతీత, ఎరువులు వినియోగానికి ఎకరాకు ఖర్చు చేసిన రూ.26 వేలు వరకు నష్టం వస్తుందని చెబుతున్నారు. ఈగ్రామంలోనే కాదు... జిల్లాలో లక్షా 54 వేల హెక్టార్లలో సాగవుతున్న వరి రైతుల్లో ఎక్కువ మంది ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

అలాగే కష్ణానది తీరం వెంబడి ఉన్న పెనమలూరు, ఉయ్యూరు, పమిడిముక్కల, కంకిపాడు, తోట్లవల్లూరు మోపిదేవి, అవనిగడ, చల్లపల్లి, తదితర మండలాల్లో సాగు చేసిన కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. జిల్లాలోని 45,040 హెక్టార్లలో వరి పంట దెబ్బతిని 54,180 మంది రైతులు నష్టపోయారు. 1,416 హెక్టార్లలో బొప్పాయి, అరటి, కూరగాయల పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. అరటి, బొప్పాయి, కంద, పసుపు, తమలపాకు తదితర పంటలకు సంబంధించి ఎకరాకు రూ.60 వేల నుంచి లక్ష రూపాయలు, కూరగాయ పంటలకు ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టారు. తుపానుకు పంటలు దెబ్బతినడంతో అప్పులపాలవుతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉద్యనవన పంటలకు సంబంధించి మొత్తం 2,229 మంది రైతులకు రూ.73 కోట్ల మేర పంట నష్టం వాటిల్లిందని అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. అలాగే మినుము, పెసర పంటలు కూడా దెబ్బతిన్నాయి.

పంటల బీమా చేయించిన రైతులు 44 వేల మందే

ప్రధానంగా ప్రకతి విపత్తుల సమయంలో అందించే బీమా ప్రీమియం చెల్లించిన, ఆపద సమయంలో పరిహారం చెల్లించే విషయంలో ప్రైవేట్ బీమా కంపెనీలు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. దీంతో పంటల బీమా ప్రీమియం చెల్లించడానికి రైతులు ముందుకు రాలేదు. గత ఖరీఫ్‌లో 1,42,409 మంది రైతులు తమ పంట పొలాలను బీమా చేయించారు. అయితే ఈ ఖరీఫ్‌లో కేవలం 44,034 మంది రైతులు మాత్రమే తమ పంటలను బీమా చేయించుకోవడం గమనార్హం. దీంతో పంటల బీమా పరిహారం అందే అవకాశం లేదు. ప్రభుత్వ సహాయం కోసమే రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

విరిగిన 446 విద్యుత్ స్తంభాలు

గాలుల తీవ్రతకు భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు సైతం విరిగిపోయాయి. ఈదురుగాలులకు జిల్లాలో 446 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చెట్లు పడటంతో ఎక్కడికక్కడ విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో కృష్ణాజిల్లావ్యాప్తంగా 15 నుంచి 24 గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మంగళవారం సాయంత్రం నాలుగు నుంచి బుధవారం సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు, నేలకూలిన విద్యుత్ స్తంభాలకు 326 మంది సిబ్బంది మరమ్మతులు చేసి బుధవారం సాయంత్రం ఆరు గంటలకు చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. రహదారులపై నేలకూలిన వక్షాలను యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. ఉదయం 10 గంటల వరకు ఆర్‌టిసి బస్సు సర్వీసులను నిలిపివేశారు. ఆ తర్వాత పునరుద్ధరించారు. మరోవైపు జిల్లా అధికార యంత్రాంగం సహాయ చర్యల్లో నిమగ్నమైంది. 177 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు లోతట్టు ప్రాంతాల్లోని 14 వేల మందిని తరలించారు.

రోడ్లపై నీరు

విజయవాడలో పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్, నిర్మల కాన్వెంట్ రోడ్డు, భానునగర్ రోడ్, వన్‌టౌన్ అండర్ ప్రాస్, దుర్గాపురం, బందర్ రోడ్, లయోలా కాలేజ్ రోడ్, జమ్మి చెట్టు సెంటర్, సిద్ధార్థ కాలేజ్ రోడ్డు, ఈఎస్‌ఐ రోడ్, ఏలూరు రోడ్, బస్టాండ్ నేషనల్ హైవే, భారతి నగర్, ఫార్చ్యూన్ మురళి పార్క్ రోడ్ ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచింది. దీంతో విఎంసి సిబ్బంది ఎయిర్ టెక్ మిషిన్లు, గల్ఫర్లతో ఎప్పటికప్పుడు నీరు తొలగించారు. రోడ్లపై పడిన 93 చెట్లను, కొమ్మలను తొలగించారు. ఈ పనులను విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర పర్యవేక్షించారు. నగరంలో ఏర్పాటు చేసిన 41 పునరావాస కేంద్రాలను మేయర్ రాయన భాగ్యలక్ష్మి పరిశీలించారు. 349 మంది బాధితులకు సహాయక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బుడమేరుకు వరద వస్తోందని కొంత మంది చేస్తున్న ఫేక్ ప్రచారాన్ని నమ్మొద్దని సిపి ఎస్.వి.రాజశేఖరబాబు స్పష్టం చేశారు. బుడమేరు, మునేరు తదితర వాగులు, వంకలు, కాల్వల పరిసర ప్రాంతాలను నిరంతరం డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా వివిధ రూపాల్లో పోలీసు సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారని తెలిపారు.




తోట్లవల్లూరు, చల్లపల్లిలో నేలవాలిన పంటలను పరిశీలిస్తున్న నాయకులు

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

- ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు
- నీటమునిగిన పంటలను పరిశీలించిన నేతలు

ప్రజాశక్తి-తోట్లవల్లూరు: తుపాను వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవటానికి సక్రమంగా ఎన్యూమరేషన్ చేయాలని, ఎన్యుమ రేషన్ టీంలలో రైతు, కౌలు రైతులను కూడా చేర్చాలని ఎపి కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. బుధవారం రైతు, కౌలు రైతు సంఘం నాయకుల బృందం మొంథా తుపాను వల్ల నష్టపోయిన పొలాలను పరిశీలించారు. తోట్లవల్లూరు మండలంలో తోట్లవల్లూరు, వల్లూరుపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ ఈ సంవత్సరం అధిక వర్షాలు, వరదలతో రైతులు, కౌలు రైతులు కోలుకోలేని స్థితిలో ఉన్నారని, వీటికి తోడు ఈ తుపానుతో మరింత నష్టపోయారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వరికి ఎకరానికి రూ.30 నుండి రూ. 35 వేల వరకు ఇప్పటికే పెట్టుబడి పెట్టారని, తుపానుతో పంట చేతికి వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. మెట్ట పైర్లు పసుపు, మినుము మొదలు పంటలు కూడా దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం నిబంధనలను సడలించి నష్టపరిహారంలో కౌలు రైతుల పేర్లు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వమే మద్దతు ధరకు పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వరికి ఎకరానికి 20 వేల రూపాయలు నష్టపరిహారం అందించాలన్నారు. రెండో పంటకు విత్తనాలు ఉచితంగా సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, రైతు సంఘం నాయకులు పి.దుర్గారావు, కౌలు రైతుల సంఘం నాయకులు వీరంకి శ్రీనివాసరావు, అన్నం నాగేశ్వరరావు, కౌలు రైతులు కె బసవరావు, కే నాగేశ్వరరావు, జంపాన రాజు, పిట్టి వెంకటేశ్వరరావు, బోలెం శ్రీను, డొక్కు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. గరికపర్రు, కనకవల్లి, కొమ్మమూరు గ్రామాల్లో తుఫాన్ వల్ల నెలకొరిగిన వరి పైరులను కౌలు సంఘం జిల్లా అధ్యక్షులు కె.శివ నాగేంద్రం, సిపిఎం నాయకులు కే కొండల బాబు, బుల్లయ్య పరిశీలించారు. **మొవ్వ:** మొవ్వ మండలంలో వరి పొలాలు పూర్తిగా నీట మునిగాయి. వ్యవసాయాధికారులు పరిశీలించి రైతులను ఆదుకోవాలని సిపిఎం మండల కమిటీ సభ్యులు కాకి రాజశేఖర్ కోరారు. **ఉంగుటూరు (గన్నవరం):** అన్ని రకాల పంటలకు నష్టం అంచనా వేసి ప్రతి రైతుకు పరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని నాయకులు కోరారు. ఉంగుటూరు మండల వ్యవసాయ శాఖాధికారి జి.రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు మండలాల కార్యదర్శులు మల్లంపల్లి ఆంజనేయులు, బేత శ్రీనివాసరావు, అజ్మీరా వెంకటేశ్వరరావు, మండల నాయకులు అనుమోలు వెంకటేశ్వరరావు, బి.మరియదాసు, శివాచారి, రాజనాల సురేష్, మహ్మద్ అబ్దుల్ బారీ. రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు టివి లక్ష్మణస్వామి, సూరగాని సాంబశివరావు, మాగంటి సాంబశివరావు, నక్కా రామయ్య, సలీం తదితరులు పాల్గొన్నారు. **బంటుమిల్లి: కృత్తివెన్ను** మండలంలో రైతు సంఘం ఆధ్వర్యంలో మునిపెడ, నీలిపూడి, కొమ్మాల్లపూడి, సీతనపల్లి, కృత్తివెన్ను, యెండపల్లి, చెరుకుమిల్లి, చిన్న పాండ్రాక తదితర గ్రామాల్లో నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ నష్టపోయిన రైతాంగాన్ని, ఆక్వా రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆక్వా రైసింగ్ జిల్లా నాయకులు, కొమలపూడీ సర్పంచ్ ప్రత్తిపాటి రామాంజనేయులు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావానికి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కృత్తివెన్ను మండల రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు నడకుదిటి ఏడుకొండలు, కూనసాని రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు లంకదాసుల అజయ్ ఘోష్, సిఐటియు నాయకులు మాజేటి శివశ్రీనివాసరావు, పుప్పాల గోవర్ధనరావు, అమ్మిశెట్టి రెడ్డిమ్మ, గుంటిపల్లి చిన్న, పోకల వీరాఘవయ్య పాల్గొన్నారు. **పామర్రు:** మండల పరిధి పెదమద్దాలి గ్రామంలో పంట పొలాలను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.పవన్ పరిశీలించారు. రైతులతో మాట్లాడి నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఓ.గంగాధర్ ప్రసాద్, గొర్రిపర్తి ఆంజనేయప్రసాద్, బ్రహ్మయ్య, కుండేటి వెంకటేశ్వరరావు, గొర్ల సోమేశ్వరరావు, ఆడుసుమిల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. **కంకిపాడు:** మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో నాయకులు పర్యటించారు. ప్రభుత్వం వెంటనే నష్టపోయిన పంటలను పరిశీలించి రైతులను వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టి.నరేష్, వి.శివశంకర్, సిహెచ్.శ్రీహరి, భీమవరపు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి:** మండల పరిధిలోని పుచ్చగడ్డ, కొత్త మాజేరు, లక్ష్మీపురం గ్రామాలలో పర్యటించి నీట మునిగిన ముంపు పొలాలను, పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు, నాయకులు వాక రామచంద్రరావు, లంకపల్లి సత్యం, మహమ్మద్ కరీముల్ల, రావుల దావీదు, వేముల నాగేశ్వరరావు, కల్లేపల్లి లక్ష్మీ నాంచారయ్య, కాగిత వెంకటేశ్వరరావు, మోతుకూరి అంకాలు, శ్రీనివాసరావు, శొంఠి మంగమ్మ తదితరులు పాల్గొన్నారు. **ఘంటసాల:** మండల పరిధిలోని దేవరకోట, లంకపల్లి, దాలిపర్రు గ్రామాల్లో వరి పొలాలను రైతు సంఘం నాయకులు వాకా రామచంద్రరావు, యద్దనపూడి మధు, సిఐటియు నాయకులు మహమ్మద్ కరిముల్లా పరిశీలించారు. **గుడివాడ :** గుడివాడ తట్టివర్రు రోడ్డులోని తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను సిపిఎం నాయకులు పరిశీలించారు. తొలుత తట్టివర్రు రోడ్డులో సిపిఎం బృందం తుఫాన్ వల్ల దెబ్బతిన్న వరి పంట పొలాన్ని పరిశీలించగా అక్కడ తెల్ల విత్తనం ఎక్కువగా కింద పడిపోయి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి, పట్టణ కమిటీ సభ్యులు చంద్రగిరి శివ నాగమల్లేశ్వరరావు, రేపాని కొండ, బొంతు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కూలిన చెట్లు... రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: తుపాను ప్రభావంతో మండల పరిధిలోని గుడ్లవల్లేరు-ముదినేపల్లి రహదారిపై, గుడ్లవల్లేరు నుండి విన్నకోట గ్రామం వరకు సుమారు 20 చెట్లు కూలిపోయాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పరిస్థితిని గమనించిన గుడివాడ డివిజన్ ఉపాధ్యక్షుడు బి.వెంకటరమణ అధికారుల సమన్వయంతో రహదారిపై పడిన చెట్లను పూర్తిగా తొలగించారు. అలాగే విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేపట్టి విద్యుత్‌ను పునరుద్ధరించినట్లు ఈఈ జి.బి.శ్రీనివాసరావు తెలిపారు.



పామర్రులో...



ఉయ్యూరులో...

మోపిదేవి: రావివారిపాలెం గ్రామంలో 123 సంవత్సరాల రావి చెట్టు, పలుచోట్ల చెట్టు నేలవాలాయి. కరెంటు స్తంభాలు పడిపోవడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. బొబ్బర్లంకలో కృష్ణానది కరకట్టపై చెట్లు విరిగి పడిపోవడంతో సహాయక చర్యలను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు పరిశీలించారు. **అవనిగడ్డ:** అవనిగడ్డలో సిఐ యువ కుమార్, ఎస్సై శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చెట్లు కూలిన వెంటనే అక్కడికి చేరుకొని వాటిని తొలగించి రవాణా సౌకర్యానికి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టారు. తుఫాను వల్ల తీవ్రమైన ఈదురు గాలులకు రహదారులపై పదుల సంఖ్యలో వృక్షాలు నేలకూలగా, విద్యుత్ తీగలు తెగి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. తాగునీటికి సైతం ప్రజలు నానా అవస్థలు పడ్డారు. **పామర్రు:** తుపాను కారణంగా మండల పరిధిలోని పెద్దమద్దాలికి వెళ్లే ప్రధాన రహదారిపై తాడిచెట్టుతో పాటు మరో చెట్టు అడ్డంగా పడిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీంతో మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారికి వచ్చి అక్కడ నుండి బల్లిపర్రు మీదుగా పెద్ద మద్దాలికి వెళ్లాల్సి వస్తుంది. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. **ఉయ్యూరు:** ఈదురుగాలులకు ఏడు గృహాలు పడిపోగా, 48 వృక్షాలు కూలిపోగా, 30 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని తహసీల్దార్ సురేష్ కుమార్ తెలిపారు. వెంటనే స్పందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. **గుడివాడ :** జాతీయ రహదారిపై నేలకూలిన విద్యుత్ స్తంభాలను రూరల్ ఎస్ఐ చంటిబాబు బుధవారం పరిశీలించి వాటిని తొలగించేలా ఏర్పాటు చేశారు. రూరల్ మండలంలోని రామనపూడి జాతీయ రాహదారిపై నేలకూలిన స్తంభాలను విద్యుత్ అధికారులతో మాట్లాడి తొలగించి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూశారు.

పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లు

ప్రజాశక్తి-మొవ్వ: మండల పరిధిలోని పెదపూడి ఎంపియుపి హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా సందర్శించారు. బాధితులను పరామర్శించి సౌకర్యాల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం టిడిపి సీనియర్ నాయకులు నన్నపనేని వీరేంద్ర సౌజన్యంతో దుప్పట్లను పంపిణీ చేశారు. కూచిపూడిలోని అంగులవాణి, పెనుమాని సీతమ్మలకు ఆర్థిక సహాయం అందజేశారు. వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై కిసాన్ డ్రోన్స్ మూడు యూనిట్‌లను అవురుపూడి, చినముత్తేవి, నిడుమోలు రైతులకు అందజేశారు. అనంతరం నిడుమోలు జిల్లా పరిషత్ హైస్కూల్లో తుఫాను బాధితులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, నన్నపనేని వీరేంద్ర, వీరానికి తులసిదాస్, యద్దనపూడి రాజశేఖర్, తాతా ప్రభాకర్‌రావు, జనసేన పార్టీ నాయకుడు రామిరెడ్డి , రాజీవ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు:** మండలంలోని అంగలూరు, డోకిపర్రు, కౌతవరం, గుడ్లవల్లేరు తుపాను పునరావాస కేంద్రాలను మండల ప్రత్యేకాధికారి జి.రమేష్, తహసీల్దార్ బి.లోకరాజు, ఎంపీడీఓ ఇమ్రాన్ పరిశీలించారు. తుపాను బాధితులకు భోజన ఏర్పాట్లను చేపట్టారు. ఈ కార్యక్రమంలో సాగునీటి డీసీ చైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, ఎస్ఐ సత్యనారాయణ, సర్పంచి మేడేపల్లి రవికుమార్, ఉప సర్పంచి త్రిపురనేని సురేష్ పాల్గొన్నారు.



విద్యుత్ పునరుద్ధరణకు తక్షణ చర్యలు

మంత్రులు గొట్టిపాటి, కొల్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): మొంథా తుపాను వల్ల ప్రాణ నష్టం జరగడకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు మంత్రులు గొట్టిపాటి రవి, కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బుధవారం విద్యుత్ శాఖ మంత్రులు గొట్టిపాటి రవి, కొల్లు రవీంద్ర మచిలీపట్నం నగరంలో పర్యటించారు. జడ్పీ సెంటర్ సమీపంలోని చిలకలపూడి సర్కిల్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన తుపాను ప్రభావంతో చెట్లు విరిగి కూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫారంను పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ పనులను చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకముందు విద్యుత్ శాఖ మంత్రి నగరంలోని రహదారులు భవనాల అతిథి గృహంలో మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి మీడియాతో మాట్లాడారు. తుపాను ప్రభావం వల్ల జిల్లాలో విద్యుత్‌కు అంతరాయం కలిగిందని, నగరంలో ఊహించిన దానికంటే పెద్ద మొత్తంలో గాలులు వీయడం వల్ల ఆ సమయంలో ఎలాంటి ప్రమాదాలకు అవకాశం ఉండకూడదనే ఉద్దేశంతో విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు మంత్రి వివరించారు. ఇంకా 25 వేల గృహాలకు విద్యుత్తును పునరుద్ధరించాల్సి ఉందని, అందుకు తక్షణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు పరిధిలో 52 సబ్ స్టేషన్స్ ఉండగా, వాటిలో 22 సరి చేశామని, ఇంకో 19 సబ్‌స్టేషన్‌లకు తక్షణ మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. మొత్తం 471 లెవెన్ కేవీ ఫీడర్లు లైన్లకు మరమ్మతులు చేపట్టామని, ఇంకా 23కు మరమ్మతులు చేపట్టాల్సి ఉందని, వాటిని కూడా తక్షణం పూర్తి చేస్తామన్నారు. మచిలీపట్నం నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా తుఫాను ప్రభావిత జిల్లాలలో విద్యుత్ తక్షణ పునరుద్ధరణకు వేగవంత చర్యలు చేపట్టామన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో తుపాను ప్రమాదాన్ని సమర్థవంతంగా ఎదుర్కొందన్నారు. తుపాను ప్రభావంతో వీచిన గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని, ఆ సమయంలో ముందుగానే విద్యుత్ సరఫరా నిలిపివేయడం వల్ల ఎటువంటి ప్రాణహాని కలగలేదన్నారు. వాటన్నిటికీ తక్షణ మరమ్మతులు చేపట్టి పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అదే విధంగా దెబ్బతిన్న పంటలు, ఇళ్లకు ఎన్యుమరేషన్ మొదలుపెట్టామని, వారందరిని తగిన విధంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాలలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఆర్టీసీ బస్సులను వినియోగించామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డైరెక్టర్ మురళీకృష్ణ, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ సత్యానంద్, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలను ఉపయోగించుకోవాలి : ఎమ్మెల్యే



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మొంథా తుపాను కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొండ ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ కోరారు. బుధవారం ఉదయం 5వ డివిజన్‌లోని క్రీస్తురాజపురం ఆర్‌సిఎం చర్చి పరిసర ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో గత రెండు రోజులుగా వర్షాలు పడుతున్నందు వల్ల కొండలపై ఉండే చెట్లు, రాళ్ళు విరిగి పడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కాబట్టి కొండ ప్రాంతాల్లో నివసించే వారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించామని, వాటిని ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిపాటి దేవానంద్, బచ్చులకూరి అజయ్ కుమార్, దోమకొండ రవి, కోడూరు సుబ్రహ్మణ్యం, మాదాసు ప్రసాద్, కేసరపల్లి బాబూరావు పాల్గొన్నారు.

మైలవరంలో పునరావాస కేంద్రం పరిశీలన



ప్రజాశక్తి-మైలవరం : మైలవరంలో పునరావాస కేంద్రాలను, డ్రైనేజీ పూడికతీత పనులను బుధవారం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పరిశీలించారు. వరద నీరు ఎగువ నుండి వచ్చే అవకాశాలు ఉన్నచోట యుద్ధ ప్రాతిపదికన డ్రైనేజీలలో పూడిక తీత పనులకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తుపాను ప్రభావంతో రహదారులపై వర్షపు నీరు చేరడంతో తీసుకోవలసిన చర్యలపై అధికారులతో చర్చించారు. మైలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న వారిని సౌకర్యాలు గురించి ఎమ్మెల్యే వసంత అడిగి తెలుసుకున్నారు. వర్షం తగ్గేవరకు పునరావాస కేంద్రంలోని ఉండాలని ఆశ్రయం పొందుతున్న వారికి సూచించారు.

నీట మునిగిన ఇళ్లకు పరిహారం చెల్లించాలి : వెలంపల్లి



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : తుపాన్ వల్ల విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో నీట మునిగిన ప్రాంతాల్లో మాజీ మంత్రి, వైసీపీ పశ్చిమ ఇంచార్జి వెలంపల్లి శ్రీనివాసరావు బుధవారం ఉదయం పర్యటించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నగర పాలక సంస్థ కమిషనర్, ఆర్‌డిఒ తదితర ఉన్నత అధికారులనతో మాట్లాడి స్థానిక సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ నియోజకవర్గంలో హెచ్‌బి కాలనీ, ఊర్మిళ నగర్, రోటరీ నగర్, ప్రియదర్శిని కాలనీ తదితర ప్రాంతాలలో ఉన్న ఇళ్లు నీట మునిగినట్లు తెలిపారు. నీట మునిగిన ఇళ్లకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి, వైకాపా జిల్లా అధికార ప్రతినిధి కామరాజ్ హరీష్ కుమార్, పాల్గొన్నారు.

చెత్త తొలగింపు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : తుపాను కారణంగా రెడ్డిగూడెం మండల పరిధిలోని పలు గ్రామాల్లో నీటి పారుదలకు అడ్డుగా ఉన్న చెత్తను తొలగించేందుకు అధికారులు చొరవ తీసుకున్నారు. గత అనుభవాలను దష్టిలో పెట్టుకుని ఎలాంటి నీటి ప్రవాహం వచ్చినా సరే ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ సుశీలదేవి బుధవారం ఆమె మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివద్ధి అధికారి టికెవి రమణ, రెడ్డిగూడెం పంచాయతీ కార్యదర్శి రామారావు అధికారులు పాల్గొన్నారు

తుపాను బాధితులను ఆదుకోవాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు
- పునరావాస కేంద్రాల్లో సిపిఎం బృందాల పర్యటన



విజయవాడలో వరద బాధితులతో మాట్లాడుతున్న బాబూరావు

విజయవాడ : తుపాను బాధితులను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు కోరారు. పటేల్ నగర్, సుందరయ్య నగర్, రాజీవ్ నగర్, సింగ్ నగర్ తదితర ప్రాంతాలలో నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సిపిఎం నేతలు భూపతి రమణారావు, కె దుర్గారావులతో కలిసి బాబూరావు బుధవారం పరిశీలించారు. ఆయా పునరావాస కేద్రాల్లో అధికారులు ఏర్పాటు చేసిన వసతులు, వరద బాధితుల ఇక్కట్లు, వాటిల్లో తీసుకోవాల్సిన చర్యలపై బాధితులు, సంబంధిత అధికారులను బాబూరావు అడిగి తెలుసుకున్నారు. పుచ్చలపల్లి సుందరయ్య మునిసిపల్ స్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఉన్న పిల్లలకు సిపిఎం నేతలతో కలిసి బాబూరావు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ తుపాను కారణంగా విజయవాడ నగరంలోని కొండ ప్రాంతాలు, మురికివాడలు, రైల్వే ట్రాక్‌లు, కాలువగట్లు వెంబడి, ఇతర ప్రాంతాల్లో నివశిస్తున్న పేద ప్రజలు పనుల్లేక పలు రూపాల్లో ఇబ్బందులు పడుతున్నారని, వారిని అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పనులు కోల్పోయిన వారందరికీ ఆర్థిక సహాయం చేయడంతో పాటు నిత్యావసర వస్తువులు ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పునరావాస కేంద్రాల్లో పిల్లలకు పాలు, రొట్టె, బిస్కెట్లు పంపిణీ చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఆర్థిక సహాయం, నిత్యవసర వస్తువులు అన్ని ప్రాంతాలలోని ప్రజలందరికీ అందించాలని కోరారు. సిపిఎం ఆఫీసులన్నీ ప్రజల సహాయ పునరావాస కేంద్రాలుగా ఏర్పాటు చేయటం జరిగిందని, వాటిని కూడా ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురయినా ఆదుకునేందుకు తమ బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ సభ్యులు సిహెచ్ శ్రీనివాస్, డి స్టీఫెన్ బాబు, స్థానిక నాయకులు బి రాంబాబు, ఎం రమణ, లింగరాజు, వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, భారతి పాల్గొన్నారు.

రాజీవ్‌నగర్ సామాజిక ఆరోగ్య కేంద్రం సందర్శన

సింగ్‌నగర్ 63వ డివిజన్‌లోని రాజీవ్ నగర్ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి భూపతి రమణారావు, కార్యదర్శివర్గ సభ్యులు కె దుర్గారావుతో కలిసి బాబూరావు బుధవారం సందర్శించి, అక్కడి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ... వైద్యం కోసం సింగ్‌నగర్, శాంతినగర్, ప్రకాష్ నగర్, కండ్రిక పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు రాజీవ్ నగర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం కోసం వస్తుంటారని, ఈ ఆరోగ్య కేంద్రంలో మోకాళ్ళ లోతు నీళ్లు ఉండటంతో హాస్పటల్లోకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు జోక్యం చేసుకొని హాస్పటల్ ఎదురుగా మేరక పోయించాలని కోరారు. ఈ పర్యటనలో నగర కమిటీ సభ్యులు సిహెచ్ శ్రీనివాస్, డి.స్టీఫెన్ బాబు 63వ డివిజన్ శాఖ కార్యదర్శి బొంగు రాంబాబు, పాల్గొన్నారు.

తిరువూరు : తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సిపిఎం పట్టణ కమిటీ నాయకులు బుధవారం పరిశీలించారు. బాధితులకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ నిత్యం వచ్చే తుపానులతో ప్రజలకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయటమే కాకుండా భగత్ సింగ్ కాలనీలో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు ప్రభుత్వం రెండు సెంట్లు చొప్పున స్థలం ఇచ్చి ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తిరువూరు పట్టణంలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని కోరారు. ఈ పర్యటనలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు బి.వెంకటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, ఆకుల రవి, ఎం.చింతయ్య పాల్గొన్నారు. **నందిగామ :** వరద బాధితులను ఆదరోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. నందిగామ 18వ వార్డులో సిపిఎం బృందం పర్యటించింది. ఈ సందర్భంగా సిపిఎం నందిగామ కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడుతూ.. నందిగామ 18వ వార్డులోని కోరిగుంట్లలో ఇళ్లు మొత్తం నీట మునిగాయని, మొత్తం 15 కుటుంబాల వారు ఉదయం నుంచి భోజనం లేక ఆకలితో అలమటించారు. కోరిగుంట్లలో నివాసముండే వారికి భోజన సదుపాయం కల్పించాలని, క్వారీ గుంట్లలో ఉన్న నీరు మొత్తం బయటికి పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు సయ్యద్ ఖాసిం, వల్లూరు రవి శేఖర్, గోపి నాయక్, శ్రీనివాసరావు, షేక్ హుస్సేన్, లాజర్, పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం:** తుపాను ప్రభావం వల్ల కొండపల్లి మున్సిపాలిటీలో పరిధిలో నీట మునిగిన పలు ప్రాంతాల్లో సిపిఎం బృందం బుధవారం పర్యటించింది. కొండపల్లి అరుణ నగర్, శాంతి నగర్‌లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. గత వరదలకు తెగిన బుడమేరు కట్ట వద్ద మరమ్మత్తులు చేసి ఇందిరమ్మ కాలనీ, శాంతి నగర్ వాసులకు వరద ముంపు సమస్యల లేకుండా చూడాలని తెలిపారు. బుడమేరుకి వెళ్లే శాంతి నగర్ రోడ్డు గుంతల మయంగా మారిందని, ఆ రోడ్డును కూడా నిర్మించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి యం మహేష్ తెలిపారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు 25 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు, రూ.3 వేలు ఆర్థిక సహాయం తక్షణమే అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో నాయకులు ఎస్ కె బాషా, ఇ కొండలరావు, ప్రజా సంఘాల నాయకులు పిఎన్ఎం శ్రీను, పి పాపయ్య, దస్తగిరి, శేషాగిరి తదితరులు ఉన్నారు. **విజయవాడ సిటీ :** తుపాన్ కారణంగా కొండ ప్రాంతవాసుల ఇళ్లు దెబ్బతిన్నాయంటూ సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్తిబాబు పేర్కొన్నారు. 50 డివిజన్ గొల్లపాలెం గట్టు కొండ ప్రాంతంలో నివసించే చెక్క వెంకన్న, లంకే సావిత్రమ్మ, దుర్గా, రాము నివాసాలు దెబ్బతిన్న నేపథ్యంలో వారిని సత్యబాబు బుధవారం పరామర్శించారు. దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. తుపాను వల్ల ఈదురుగాలులతో భారీ వర్షం పడిందని, ఈ క్రమంలో గొల్లపాలెం గట్టు కొండ ప్రాంతంలో నివసించే చెక్క వెంకన్న ఇంటి రిటైనింగ్ వాల్ కూలిందని, అదేవిధంగా దుర్గ, రాము, లంకే సావిత్రమ్మ ఇళ్లపై చెట్లు విరిగిపడ్డాయాని తెలిపారు. ప్రకృతి విపత్తుల కారణంగా ఇళ్లు పోగొట్టుకున్న బాధితులకు జెఎన్ఎన్‌యుఆర్ఎం గృహాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న కొండ ప్రాంతవాసులను పరామర్శించారు.



ఇబ్రహీంపట్నంలో సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నేతలు



నందిగామలో పర్యటిస్తున్న సిపిఎం నేతలు



50వ డివిజన్ వాసులతో మాట్లాడుతున్న సత్యబాబు

రోడ్లపై నీరు లేకుండా చర్యలు: ధ్యానచంద్ర

ప్రజాశక్తి-విజయవాడ : మొంథా తుఫాన్ కారణంగా నగరంలోని రోడ్లపైన నిలిచిపోయిన నీటిని ఎప్పటికప్పుడు గల్పర్లు, ఎయిర్ టెక్ మిషిన్స్, ఆయిల్ ఇంజిన్స్, మోటర్ పంపులతో తొలగిస్తున్నామని నగర కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం నగరంలో కమిషనర్ పర్యటించి, మొంథా తుఫాను పరిస్థితులను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. భవానిపురం, ఊర్మిళ సుబ్బారావు నగర్, గవర్నర్పేట, సూర్యారావుపేట, జమ్మిచెట్టు సెంటర్, పిన్నమనేని పాలి క్లినిక్ రోడ్డు, నిర్మల కాన్వెంట్ రోడ్, ఎయిర్పోర్ట్ కారిడార్, ప్రసాదంపాడు మరియు నగరంలో నీటి నిల్వలు ఉన్న ప్రాంతాలలో ఎయిర్ టేక్ మిషిన్లు, గల్పర్లు, ఆయిల్ ఇంజన్లు, మోటర్ పంప్ సెట్లతో ఎప్పటికప్పుడు తొలగిస్తున్నామని అన్నారు. గవర్నర్పేటలోని ప్రజా వైద్యశాల వద్ద నాలుగు గలపర్లను పెట్టి వర్షపు నీరును తొలగించామని,



తద్వారా ఆస్పత్రికి వెళ్లే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మంగళవారం తుఫాను నేపథ్యంలో ఈదురు గాలుల వల్ల రోడ్లమీద పడిపోయిన, ప్రమాదకరంగా ఉన్న కొమ్మలు దాదాపు 93 వృక్షాలను తొలగించామన్నారు. దాదాపు 500 మందికి పైగా ప్రజలను సురక్షితమైన ప్రదేశాలకు పంపించామని, అందులో 350 మందికి పైగా పునరావస కేంద్రాల్లో నివసిస్తున్నారని తెలిపారు.

నిరంతరం వైద్య సేవలందించాలి : సౌమ్య

ప్రజాశక్తి-నందిగామ : భారీ వర్షాల నేపథ్యంలో నందిగామ పట్టణంలోని డివిఆర్ ఏరియా హాస్పిటల్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య బుధవారం సందర్శించారు. హాస్పిటల్‌లో రోగులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారీ వర్షాల దృష్ట్యా రోగులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పూర్తిస్థాయి వైద్య సేవలు అందించాలని తెలిపారు. తుపాను పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని విద్యుత్, నీటి సరఫరా, శానిటేషన్ సేవలను నిరంతరం కొనసాగించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. హాస్పిటల్ సందర్శనలో హాస్పిటల్ కమిటీ చైర్మన్ వేపూరి నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, మున్సిపల్ అధికారులు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.


అవనిగడ్డలో అరటి పంట దుస్థితి


గుడ్లవల్లేరులో వరి రైతు కష్టాలు

రైతుల్ని ముంచిన మొంథా

- వేల ఎకరాల్లో వరి పంట నాశనం
- పత్తి, మినుము, అరటి, కూరగాయ పంటలపైనా ప్రభావం
- ఆందోళనలో రైతులు

మొంథా తుపాను వరి రైతులను నిండా ముంచేసింది. వర్షాలకు ఈదురుగాలులు తోడవ్వటంతో పంట నష్టం మరింత పెరిగింది. వేల ఎకరాల్లో పంట నీట మునిగింది. పంటపై రైతులు ఆశలు వదిలేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పంట పొట్టకొచ్చిన సమయంలో తుపాను వల్ల రైతులు విలవిల్లాడుతున్నారు. పంట నేలకొరగడం, నీట మునగడంతో ఆరుగాలం కష్టించిన కష్టానికి పెట్టుబడి సైతం రాని పరిస్థితి నెలకొంది. కళ్ల ముందే పంట నాశనం అవుతుండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం తమని ఆదుకోవాలని కోరుతున్నారు.

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మొంథా తుపాను ప్రభావంతో వడ్లమన్నాడులోని వెయ్యి ఎకరాల వరి పంట మురుగునీటి ముప్పు బారిన పడింది. వడ్లమన్నాడు డ్రెయిన్ అస్తవ్యస్తంగా ఉండటం వల్లే ఈ దుస్థితి నెలకొందని రైతులు ఆరోపిస్తున్నారు. పొలాల్లో పడిన వర్షపునీటిని మురుగు కాల్వ లాక్కోగపోగా ఎగదన్నుతుందని వాపోతున్నారు. నడుము లోతులో ఉన్న పొలాల్లో ఉన్న వరి పంట పొట్ట మీద ఉంది. నీటిలో మునిగిపోవటంతో పంట చేతికి అందుతుందో లేదోనని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. **ఉంగుటూరు (గన్నవరం):** గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల్లో పంట నష్టం సంభవించింది. గన్నవరంలో 16,400 ఎకరాల వరి, 3,600 ఎకరాల పత్తి, మిరప, కూరగాయలు తదితర పంటలు సాగులో ఉండగా పత్తి పూర్తిగా పాడైంది. మిరప, కూరగాయల పంటల దిగుబడి తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉంగుటూరులో 26,400 ఎకరాల వరి, చెరుకు, పామాయిలు వెయ్యి ఎకరాలలో సాగవుతున్నాయి. బాపులపాడులో 550 ఎకరాల మినుము, 200 ఎకరాల కూరగాయల పంట, 16 వేల ఎకరాలు వరి సాగులో ఉన్నాయి. మినుము, కూరగాయల పంటలు పూర్తిగా పాడయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి పైరుకు ఎకరానికి 30 నుంచి 35 వేల రూపాయల పెట్టుబడి పెట్టామని, తుపాన్ రావడం వల్ల తాలు, మానుగాయ వస్తుందని దాని వల్ల ఎకరానికి పది బస్తాలు దిగుబడి తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి పంటకు ఎకరానికి 35 నుండి 40 వేల వరకు పెట్టుబడి అయ్యిందని కౌలు రైతులు ముందుగా కౌలు చెల్లించడం వల్ల అదనంగా 15 వేలు ఆర్థిక బారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. **అవనిగడ్డ:** మెట్ట భూముల్లోని అరటి, బొప్పాయి, కంద పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కూరగాయల తోటలు కూడా దెబ్బతినడంతో పాటు, తీగ పాదులు సొర, బీర, కాకర, దొండ పాదులు, మిరప చేలు దెబ్బతిన్నాయి. ముందుగా వేసిన వరి పొలాలు నేలకొరిగాయి. **ఉయ్యూరు:** మండల పరిధిలో సుమారు 7 వేల ఎకరాల్లో వరి పంట నేలవాలిందని ప్రాథమిక అంచనా వేసినట్లు మండల వ్యవసాయ అధికారి నిస్సీ గ్రేస్ తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్త సుధారాణి, జ్యోతి రమణి, ఏడీఏ శ్రీనివాస్ తదితరులు క్షేత్రస్థాయిలో పంట నష్టం పరిశీలించారు. **పామర్రు:** మండలంలో 1,543 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయ అధికారి వి.నాగరాణి తెలిపారు. మండల పరిధి పెదమద్దాలిలో బుధవారం పంట చేలను సంబంధిత అధికారులైన శ్రీనివాస్, శాస్త్రవేత్త సుధారాణిలతో కలిసి ఆమె పరిశీలించారు.


మొవ్వలో...

46 వేల హెక్టార్లలో పంట నష్టం

కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): కృష్ణాజిల్లాలో తుపాను కారణంగా పంట నష్టం వాటిల్లిందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. ప్రాథమిక అంచనా ప్రకారం జిల్లాలో దాదాపు 46 వేల హెక్టార్లలో వివిధ పంటలకు నష్టం వాటిల్లిందని, దీనివల్ల 56 వేల మంది రైతులపై ప్రభావం చూపిందని తెలిపారు. అదే విధంగా 114 గృహాలకు పూర్తి, పాక్షిక నష్టం వాటిల్లిందని, రెండు పశువులు, 8 మేకలు, గొర్రెలు చనిపోయాయని, 8 పశువుల పాకలు దెబ్బతిన్నాయని, కృత్తివెన్నుకు చెందిన కోయ సుబ్బారావు చెట్టు పడి మరణించారని తెలిపారు. జిల్లాలో సంభవించిన నష్టానికి ప్రభుత్వం తరుపున సహాయం అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో జరిగిన నష్టాన్ని నాలుగైదు రోజుల్లో పూర్తిస్థాయిలో ఎన్యుమరేషన్ చేపడతామన్నారు. తుఫాను సమయంలో ప్రభుత్వ సూచనలను పాటిస్తూ ప్రజలు బయటకు రాకుండా జాగ్రత్తలు పాటించి సహకరించారన్నారు. స్వచ్ఛందంగా జిల్లాలోని షాపులన్నీ మూసివేసి సహకరించిన వ్యాపార సంస్థలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.


పామర్రులో వరి పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు


ఉంగుటూరులో నేలవాలిన వరి

రైతు, కౌలు రైతు సంఘాల నేతలు పరిశీలన


కృత్తివెన్నులో...


గుడివాడలో...


ఘంటసాలలో...


కంకిపాడులో...


పామర్రులో...


ఉంగుటూరులో...

కొండ ప్రాంత ప్రజలు పునరావాస కేంద్రాలకు రావాలి : డిసిపి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ: తుపాను వల్ల కురిసిన భారీ వర్షానికి విజయవాడ నగరంలో కొండచరియలు విరిగి పడే ప్రమాదం ఉందని, కాబట్టి కొండ ప్రాంత ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలి రావాలని డిసిపి సరిత కోరారు. బుధవారం ఉదయం డిసిపి సరిత పశ్చిమ నియోజకవర్గంలోని కొండ ప్రాంతాల్లో పర్యటించారు. అక్కడ నివసిస్తున్న ప్రజల పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదం ఏర్పడే అవకాశం ఉన్న ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించే చర్యలు తీసుకున్నారు. స్థానిక పోలీస్ సిబ్బంది, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి ప్రజల భద్రత కోసం నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. తుపాను పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు కృషి చేస్తున్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు మైలవరం విద్యార్థినులు



ప్రజాశక్తి-మైలవరం : జాతీయ స్థాయి మహిళా కబడ్డీ పోటీలకు స్థానిక లక్కిరెడ్డి హనీమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికైనట్లు ఆ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మేజర్ మన్నే స్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో డిగ్రీ చదువుతున్న ఎల్.ఢిల్లీశ్వరి, టి.అశ్వినిలు గత వారం విజయవాడలో జరిగిన అంతర్ కళాశాలల మహిళ కబడ్డి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచారన్నారు. ఈ నెల 30 నుంచి చెన్నైలో జరిగే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా కబడ్డీ పోటీలలో వీరు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ రవి, అధ్యాపకులు అభినందించారు.

పంట నష్టం అంచనా



ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలం మద్దులపర్వ గ్రామంలో తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కె.మాధురి వ్యవసాయ పొలాల్లో డ్రోన్ ద్వారా పంట నష్టాలను అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జె.సుశీలదేవి, ఎంపిడిఓ టి.కె.వి.రమణ, వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గంధం పుల్లయ్య, విఆర్ఓలు, విఆర్ఎలు పాల్గొన్నారు

ఆరోపణలు రుజువు చేయాలి : సర్పంచ్



ప్రజాశక్తి-వత్సవాయి : గ్రామ పంచాయతీలో అవకతవకలు జరిగాయంటూ టిడిపికి చెందిన వార్డు సభ్యులు ప్రవీణ్ తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, అతను చేసిన ఆరోపణలు రుజువు చేయాలని వైసిపికి చెందిన పెనుగంచిప్రోలు గ్రామ సర్పంచ్ వేల్పుల పద్మకుమారి డిమాండ్ చేశారు. పెనుగంచిప్రోలు పంచాయతీ కార్యాలయంలో ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎప్పుడో కట్టిన వాటర్ ట్యాంకు, రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షల బిల్లులు డ్రా చేసినట్లు తప్పుడు సమాచారాన్ని అధికారులకు, మీడియాకు ప్రవీణ్ అందించాడని తెలిపారు. ఒక ట్యాంక్‌కు బిల్లు రావాలంటే ఎఇ, డిఇ, ఇఇ, ఎస్ఇల సంతకం చేయాల్సి ఉంటుందని, అలాంటిది రెండోసారి బిల్లులు ఎలా మంజూరవుతుందని ఆమె ప్రశ్నించారు. ఎన్‌టిఆర్ జిల్లాలో పెనుగంచిప్రోలు గ్రామానికి ఉత్తమ గ్రామ స్వచ్ఛ అవార్డు వచ్చిందని, శానిటేషన్‌లో ఐవిఆర్ఎస్ సర్వేలో పెనుగంచిప్రోలు జిల్లాలో మొదటి స్థానం సాధించిందని తెలిపారు. ఒక దళిత మహిళ పాలనలో గ్రామానికి మంచి పేరు రావడం జీర్ణించుకోలేక తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. గ్రామస్తులు ఇటువంటి పుకార్లు నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. గ్రామ అభివృద్ధి కోసం పని చేస్తానని తెలిపారు.

తుపానుతో అపార నష్టం

- నేలకొరిగిన పంటలు
- పొంగుతున్న వాగులు, వంకలు



ప్రజాశక్తి-మైలవరం : మొంథా తుపాను ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చేతికొచ్చిన పంటలు నేలకొరిగాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. చెరువులకు గండ్లు పడటంతో ఆ వరద ప్రవాహానికి సమీప గ్రామాల్లోని ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. మైలవరం నియోజకవర్గంలోని పలు మండలాల్లో వరి నేలకొరిగింది. రోజుల తరబడి వరి చేలు నీళ్లలో నానడంతో వరి కంకులు మొలకెత్తే అవకాశం ఉందని పలువురు రైతులు వాపోతున్నారు. తీతకు వచ్చిన పత్తి వర్షం ధాటికి తెల్ల బంగారం నల్ల బంగారంగా మారుతుందని రైతులు అంటున్నారు. పత్తికాయ కుళ్ళి విత్తనం మొలకెత్తి అవకాశం ఉందని, దీంతో వేలాది రూపాయలు పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మైలవరం మండలంలోని కనిమేర్ల గ్రామం వద్ద కాకర్ల వాగుపై వరద ప్రవాహం రావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పుల్లూరు, చంద్రగూడెం, చంద్రబాబు రింగ్ వద్ద బుడమేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. జీ కొండూరు మండలం వెంకటాపురంలోని ఎర్ర చెరువుకు గండి పడటంతో గ్రామస్తులు భయాందోళనలకు గురయ్యారు. చెరువులు నిండుకుండలా ఉండటంతో ఎప్పుడూ ఏ ప్రమాదం జరుగుతుందోనని మైలవరం, జి.కొండూరు మండలాల్లో రెవెన్యూ, మండల పరిషత్, పోలీస్ వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పరిశీలిస్తున్నారు. వ్యవసాయ అధికారులు నేలకొరిగిన వరి పంటలను పరిశీలించారు.

కూలిన ఇంటి పైకప్పు

ప్రజాశక్తి-విస్సన్నపేట : తుపాను కారణంగా ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి బుధవారం విస్సన్నపేట మండలం తాతకుంట్ల గ్రామంలోని కొదమూరు విష్ణువర్ధన్‌రావు పెంకుటిల్లు పైకప్పు కూలిపోయింది. ఇంటి యజమాని, కుటుంబ సభ్యులు సురక్షితంగా బయటపడ్డారు. ఇంటిని కోల్పోయిన తమను ఆదుకోవాలని బాధితులు ప్రభుత్వాన్ని కోరారు.

డ్రోన్‌తో పంటల పరిశీలన

ప్రజాశక్తి-గంపలగూడెం: మొంథా తుపాను నేపథ్యంలో దెబ్బతిన్న పంట పొలాలు, నీటి మునిగిన వాగులను డ్రోన్ ద్వారా తహశీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి పరిశీలించారు. బుధవారం మండలంలోని అమ్మిరెడ్డిగూడెం పంట పొలాలు, గంపలగూడెం-ఎన్టీఆర్ కాలనీ పరిధిలో ఉన్న పంట పొలాలు, కట్టలేరు ఉధృతిని చిత్రీకరించి, ఉన్నతాధికారులకు పంపించారు. ఈ కార్యక్రమంలో సర్వే సిబ్బందితోపాటు రెవెన్యూ ఇన్స్పెక్టర్ వీరభద్రరావు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్



ప్రజాశక్తి-కంచికచర్ల : చెరువులు, వాగులు వంకలు పొంగి ప్రవహించి ప్రజలకు, రవాణా సౌకర్యాలకు ఆటంకం కలుగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండి అన్నిరకాల చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. కంచికచర్ల మండలం పరిటాల రహదారి ప్రక్కన ఉన్న చెరువును నందిగామ ఆర్డిఓ కె బాలకృష్ణతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. తుఫాను ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు, చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి. గత ఏడాది భారీ వర్షాలకు పరిటాల చెరువు పొంగి రహదారిపైకి నీరు ప్రవహించడంతో పరిటాల విజయవాడ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయని తెలిపారు. అటువంటి సంఘటనలు పునరావతం కాకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎప్పటికప్పుడు వరద ప్రవాహాన్ని పరివేక్షిస్తూ తగు చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ వెంట కంచికచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ కోగంటి బాబు, తాపశీల్దార్ నరసింహారావు, సిఐడి చవాన్, అధికారులు పాల్గొన్నారు.

రెయిన్ కోట్లు పంపిణీ



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట పట్టణానికి చెందిన పేరూరి బ్రహ్మ ఉపేంద్రరావు, భారతి ట్రస్టు ఆధ్వర్యంలో వారి అల్లుడు పోలా శ్రీనివాసరావు సౌజన్యంతో మున్సిపల్, ఎలక్ట్రికల్ సిబ్బందికి రెయిన్ కోట్లను ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ చేతులమీదుగా బుధవారం పంపిణీ చేశారు. జగ్గయ్యపేట పట్టణంలోని తన నివాసంలో శ్రీరాం రాజగోపాల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, డిసి కెనాల్ చైర్మన్ ఏలూరి గోపాలరావు, మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు, పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ



ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలోని బాధితులకు తిరువూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. తిరువూరు పట్టణంలోని భగత్ సింగ్ కాలనీకి చెందిన 40 కుటుంబాలకు న్యాయవాదుల వితరణతో న్యాయమూర్తి అట్లూరి సింధూర దుప్పట్లు పంపిణీ చేశారు. తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కె.మాధురి తిరువూరు, విస్సన్నపేట, గంపలగూడెం, ఏకొండూరు, రెడ్డిగూడెం మండలాల్లో పర్యటించి తుపాను పరిస్థితిని సమీక్షించారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు రాకెట్ సప్లయ్ చానల్, పోతుల చెరువు, మల్లమ్మ చెరువులను పరిశీలించి కట్టలు తెగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: వరద ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. మొంథా తుపాను ప్రభావంతో పట్టణంలో కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా నీట మునిగిన ఆర్టీసీ కాలనీ, వేపల వాగు పరిసర ప్రాంతాల్లో బుధవారం ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య, మున్సిపల్ చైర్మన్ శ్రీరంగాపురం రాఘవేంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వరద ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

బ్యాంకు ఉద్యోగి దురుసు ప్రవర్తన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని యూనియన్ బ్యాంక్‌లో క్యాషియర్‌గా పని చేస్తున్న ఉద్యోగి ప్రవర్తన కస్టమర్లకు తలనొప్పిగా మారుతోంది. డ్వాక్రా లోను కట్టడానికి యూనియన్ బ్యాంక్‌కు వెళ్లిన షేర్ మొహమ్మద్ పేటకు చెందిన ఓ వ్యక్తికి చేదు అనుభవం ఎదురైంది. బ్యాంకు బయట బిసి పాయింట్ ఉందని, లోను డబ్బులు కట్టించుకొనని క్యాషియర్ లక్ష్మన్ దురుసుగా సమాధానం చెప్పడంతో ఖంగుతున్నాడు. బయట బిసి పాయింట్ లేదని, దయచేసి లోను కట్టించుకోవాలని కస్టమర్ ప్రాధేయపడినా వినిపించుకోలేదు. దీంతో బాధితుడు మేనేజర్‌కు ఫిర్యాదు చేసినా క్యాషియర్ పట్టించుకోలేదు. చివరికి మేనేజర్ ఒత్తిడితో లోను కట్టించుకున్నాడు. కస్టమర్ల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్న క్యాషియర్ లక్ష్మణ్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

స్తంభించిన జనజీవనం



ప్రజాశక్తి-కంచికచర్ల

మొంథా తుపాను ప్రభావంతో కంచికచర్ల మండలంలో జనజీవనం స్తంభించిపోయింది. మంగళవారం రాత్రి నుండి బుధవారం మధ్యాహ్నం వరకు భారీ ఈదురు గాలులతో భారీ వర్షం కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. మంగళవారం ఉదయానికి సుమారు 7 సెంటీ మీటర్ల వర్షం కురిసిందని అధికారులు తెలిపారు. ఈదురు గాలులు వీయడంతో బుధవారం ఉదయం 10 గంటల దాకా ప్రజలు బయటకు రాలేదు. దీంతో వీధులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. భారీ వర్షానికి డ్రైన్లు పొంగి రోడ్లపైకి ప్రవహించటంతో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. వసంతకాలనీ, ఇందిరా కాలనీ, జంగాల కాలనీలకు వరదనీరు ఇళ్ళల్లోకి చేరింది. దీంతో అధికారులు హుటాహుటిన ఆయా ప్రాంతాల్లోని బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. మండలంలోని పరిటాల, గని ఆత్కూరు, కీసర, కంచికచర్లలో 4 పునరావాస కేంద్రాలకు సుమారు 50 కుటుంబాలకు చెందిన 170 మందిని తరలించినట్లు తహశీల్దార్ నరశింహారావు తెలిపారు. భారీ వర్షాలకు కంచికచర్ల ఆర్టీసి బస్టాండ్ ఆవరణ నీట మునిగింది. జుజ్జూరు రోడ్డు, గొట్టుముక్కల రోడ్డు, జాతీయ రహదారిపై వరద నీరు పారింది. ఈదురుగాలుకు కంచికచర్లతో పాటు పలు గ్రామాల్లో చెట్లు విరిగిపోయాయి. కొన్నిచోట్ల హోర్డింగులు పడిపోయాయి. కరెంటు స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. రైతులు సాగు చేసిన పత్తి, మిర్చి, వరి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలో 3005 ఎకరాలలో పలు పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారి విజయకుమార్ పేర్కొన్నారు.



బోట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

బాధితులకు అండగా ఉంటాం : మండలి

ప్రజాశక్తి-నాగాయలంక: తుపాన్ బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. బుధవారం నాగాయలంక రేవులో తుఫానుకు దెబ్బతిన్న బోట్లను పరిశీలించారు. నియోజకవర్గంలో ఆక్వా రైతులకు జరిగిన నష్టం, మత్స్యకారుల బోట్లు, వలలు దెబ్బతిన్న వివరాలను మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రతిభ ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుఫాన్ మత్స్యకారులను తీవ్రంగా నష్టపరిచిందన్నారు. మత్స్యకారుల పడవలు కొన్ని నీటిలో మునిగిపోవడం, కొన్ని కొట్టుకుపోవడం, వలలు ధ్వంసం కావడంతో మత్స్యకారులు నష్టపోయారన్నారు. చేపలు, రొయ్యల చెరువులకు నష్టం కలిగిందన్నారు. తుఫాను కారణంగా మత్స్యకారుల వేట నిలిచిపోయిన నేపథ్యంలో వారి జీవనం కోసం సీఎం ఆదేశాలతో ఇప్పటికే మత్స్యకారుల కుటుంబాలకు 50 కిలోల చొప్పున బియ్యం సహాయం ఇస్తున్నట్లు తెలిపారు. తుఫాను కారణంగా అరటి, బొప్పాయి, కంద, పసుపు తోటలకు నష్టం వాటిల్లిందన్నారు. వరి పైర్లు వాలిపోయాయన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో పంట నష్టం అంచనా వేయించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతులను సత్వరమే ఆదుకునేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగ మల్లికార్జునరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు, ఉప సర్పంచ్ తలశిల వెంకట నరసింహారావు (నాని), మాజీ ఏఎంసీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, లకనం నాగాంజనేయులు, కర్రి కృష్ణమూర్తి, రేవు సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: తుపాన్ ప్రభావంతో కురిసిన అధిక వర్షాలకు పంట పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపాలని మచిలీపట్నం వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.కె నాగేంద్రరావు తెలిపారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త జె.యశ్వంత్‌కుమార్‌తో కలిసి మచిలీపట్నం మండలంలోని



ఎస్ ఎన్ గొల్లపాలెం, బివి తోట, సీతారామపురం, రుద్రవరం, గుండిపాలెం, చిన్నాపురం, నెలకుర్రు, భోగిరెడ్డిపల్లి, ఎన్ గొల్లపాలెం గ్రామాల్లో పంట పొలాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేంద్రరావు రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం.రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సస్య రక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-చల్లపల్లి

తుఫాను వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వరి పంటలో మానిపండు తెగులు, పాముపొడ తెగులు,అగ్గి తెగులు సుడిదోమ ఆశించే అవకాశం ఉండటంతో శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు వెంటనే తగిన సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఏవో కె.మురళీకృష్ణ రైతులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం తుఫాను ప్రభావిత గ్రామాలలో పర్యటించిన ఆయన రైతులతో మాట్లాడి సూచనలను అందించారు. పొలంలో నిలబడిన వర్షపు నీటిని చిన్నచిన్న కాలువల ద్వారా బయటకు పంపించాలన్నారు. వెలివోలు, యార్లగడ్డ, వక్కలగడ్డ, పురిటిగడ్డ, పాగోలు, లక్ష్మీపురంలలో ఆయన పర్యటించారు.

సిపిఐ నేతలకు నివాళి

ప్రజాశక్తి-చల్లపల్లి

దివి తాలూకా కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు హనుమానుల శివరామకృష్ణ, మల్లుపెద్ది కృష్ణమోహన్ 27వ వర్ధంతిని మండల పరిధిలోని వక్కలగడ్డలో బుధవారం నిర్వహించారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, రైతు సంఘం నేత హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లిపెద్ది రక్తకుమారి నేతల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు శ్రీధర్, పాలడుగు రత్నబాబు, మల్లుపెద్ది జగన్మోహన్ రావు, రాజా, రాణి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్త సురేంద్రబాబు మృతి

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం)



గన్నవరం శ్రీనగర్ కాలనీకి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త ముక్కామల సురేంద్రబాబు బుధవారం అనారోగ్యంతో హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మృతిచెందారు. గురువారం ఉదయం పది గంటలకు గన్నవరంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

పంట నష్టంపై ఆరా

ప్రజాశక్తి-కంకిపాడు, ఉయ్యూరు: కంకిపాడు మండలం అధికారులతో కలిసి మంతెన, తెన్నేరు, జగన్నాథపురం, ఉయ్యూరు మండలం అధికారులతో కలసి కలవపాముల, కాటూరు, కడవకొల్లు, ఆకునూరు గ్రామాల్లో వరి పంటలను ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పరిశీలించారు. పంట నష్టంపై ఆరా తీశారు. తుఫాన్ ప్రభావం వలన తీవ్రంగా వీచిన గాలులకు వరిచేలు పూర్తిగా దెబ్బతిన్నాయని, రైతులకు తీవ్రంగా నష్టపోతున్నారని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సమన్వయంగా పనిచేసి ప్రజలకు భరోసా కల్పించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చేయగలిగామని అన్నారు. తుపాను ప్రభావంతో విరిగిన చెట్లు



తొలగించి విద్యుత్ స్తంభాలు పునరుద్ధరించామన్నారు. ఈ కార్యక్రమంలో కలవపాముల పీఏసీఎస్ అధ్యక్షుడు కలపాల మల్వేశ్వరరావు, కాటూరు చైర్మన్ చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ ప్రవీణ్, సీనియర్ టీడీపీ నాయకుడు వేమూరు శ్రీనివాసరావు, ప్రభాకరరావు, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీవో శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



ఇళ్లలోకి చేరిన నీరు

ప్రజాశక్తి-చల్లపల్లి: తుపాను ప్రభావంతో పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని కొత్తమాజేరులో పల్లపు ప్రాంతంలో నీరు ఇళ్లల్లోకి చేరింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇంట్లోకి నీరు రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు మహిళలు వాపోయారు. వర్షాలకు గుంటలలో నీరు చేరడంతో పనికి అడ్డంకులు ఏర్పడ్డాయని చేనేత కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో 20 మంది కుటుంబాలు చేనేతపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చేనేత గుంటలో నీరు చేరడంతో పని ఆపివేయవలసి వచ్చిందని చేనేత కార్మికులు తెలిపారు. ఇంకా 15 రోజుల వరకు చేనేత పని సాగదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

చలిగాలులకు ఒకరు మృతి



ప్రజాశక్తి-బంటుమిల్లి: చలిగాలులకు ఒకరు మృతిచెందిన సంఘటన బంటుమిల్లిలో బుధవారం చోటుచేసుకుంది. బంటుమిల్లి ఆంధ్ర బ్యాంక్ వెనుక బొర్రా పాండురంగారావు నివాసం ఉంటున్నాడు. తుపాన్ కారణంగా తీవ్ర చలిని తట్టుకోలేక మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

విద్యుత్ స్తంభాలు పునరుద్ధరణ

ప్రజాశక్తి-నందివాడ: మంగళవారం అర్ధరాత్రి నుంచి వీస్తున్న ఈదురుగాలుల ప్రభావంతో తమిరిశ, విరివాడ గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

స్వగృహాలకు బాధితులు

ప్రజాశక్తి-పామర్రు: తుపాను కారణంగా పామర్రులోని కంచర్ల రామారావు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలోని 365 మంది బాధితులను సంబంధిత అధికారులు బుధవారం వారి గృహాలకు ప్రత్యేక వాహనాల్లో పంపించారు. గత రెండు రోజులుగా తాసిల్దార్ రవికాంత్ ఆధ్వర్యంలో ఆర్ఐ.రాము పర్యవేక్షణలో వీరికి అన్ని వసతులు కల్పించారు. ఈ శిబిరంలో సానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపడమే కాకుండా సహాయ చర్యల్లో కూడా చురుకుగా పాల్గొన్న పారిశుధ్య సిబ్బందిని పలువురు అభినందించారు.

డిసి చైర్మన్ పర్యటన

ప్రజాశక్తి-బంటుమిల్లి: అత్తమూరు గ్రామంలో సుమారు నీట మునిగిన వరి పొలాలను డిసి చైర్మన్ బొర్రా కాశి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2500 ఎకరాల్లో వరి పంట నీట మునిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కంటమనేని మురళి, భూపతి రమేష్, కాగిత రవి, యార్లగడ్డ చిన్న వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తుపాను ప్రభావంపై సమీక్ష

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: రాష్ట్ర వేర్‌హౌస్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మండల టిడిపి అధ్యక్షులు కోసరాజు బాపయ్య చౌదరి, కొడాలి రామరాజు మండల పరిషత్ కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రావి వెంకటేశ్వరరావు మండలంలోని అధికారులతో సమావేశమై తుఫాను ప్రభావం గురించి సమీక్ష నిర్వహించారు. మండల పరిధిలో ఉన్న పరిస్థితులను తెలుసుకుని, తక్షణం అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా విద్యుత్ అంతరాయం ఉన్న గ్రామాలలో వెంటనే మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించేందుకు సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ సమావేశంలో మండల స్పెషల్ ఆఫీసర్ జి.రమేష్, ఎంపీడీవో ఇమ్రాన్, తహసీల్దార్ బి.లోకరాజు, డిప్యూటీ ఎంపీడీవో అంజనా దేవి, వ్యవసాయ అధికారి సునీల్ పాల్గొన్నారు. అనంతరం మండలంలోని పునరావాస కేంద్రాలను సందర్శించి శానిటేషన్, భోజన వసతులు పరిశీలించారు.

భోజనం ఏర్పాటు

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ నియోజకవర్గంలో మొంథా తుఫాన్ కారణంగా గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో గుడివాడ నియోజకవర్గంలో స్కూళ్ళలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను కూటమి నాయకులు సందర్శించి భోజనాల ఏర్పాట్లు పరిశీంలించారు. బుధవారం కూటమి నాయకులు పునరావాస కేంద్రాలను సందర్శించి బాధితులను పరామర్శించి వారికి భోజన ఏర్పాట్లు చేసారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి నాయకులు వెనిగండ్ల నాని, చేకూరి జగన్‌మోహన్, పాండ్రాజు సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

31న పవర్ లిఫ్టింగ్ పోటీలు

ప్రజాశక్తి-గుడివాడ : ఈ నెల 31వ తేదిన ఎన్‌టిఆర్ మెమోరియల్, ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల ఓపెన్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటిలు నిర్వహిస్తున్నట్లు ఎన్‌టిఆర్ స్టేడియం ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా ప్రణాళికలో భాగంగా ఎన్‌టిఆర్ స్టేడియంలో ఎన్‌టిఆర్ మెమోరియల్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల ఓపెన్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటిలు జరుగుతాయన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఉన్న పవర్ లిఫ్టర్లు ఈ పోటిలలో పాల్గొనవచ్చున్నారు.

మున్సిపల్ సిబ్బంది చర్యలు

ప్రజాశక్తి-గుడివాడ : మొంథా తుఫాన్ ప్రభావంతో గుడివాడ పట్టణంలోని అనేక ప్రాంతాలలో చెట్లు కూలిపోవడం, విద్యుత్ అంతరాయం, రోడ్లపై వర్షపు నీటి నిల్వాలు, డ్రైనేజీ మూసుకుపోవడం వంటి ఇబ్బందులు తలెత్తిన నేపథ్యంలో గుడివాడ పురపాలక సంఘం తరపున తక్షణ చర్యలు చేపట్టడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ పేర్కొన్నారు.



తుఫాన్ కారణంగా పట్టణంలోని అనేక ప్రాంతాలలో చాలా చెట్లు నేలకూలిన నేపథ్యంలో, వాటినన్నిటినీ జెసిబి, పవర్ సాస్, ట్రీ కట్టర్స్ సహాయంతో యుద్ధ ప్రాతిపదికన తొలగించడం జరిగిందన్నారు. రోడ్లపై నీటి నిల్వాలు తొలగించి, డ్రైనేజీలను శుభ్రపరచి, శానిటేషన్ పనులు వేగంగా కొనసాగు తున్నాయని, ప్రజలకు అవసరమైన సేవలు నిరంతరాయంగా అందించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో కృషి చేస్తున్నాయన్నారు. సాధారణ స్థితికి వచ్చే వరకు పనులు కొనసాగుతాయన్నారు.

నేటి నుంచి సత్యదేవుని మహోత్సవాలు



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

గుడ్లవల్లేరు సంతరోడ్డులోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి శిఖర ప్రతిష్టా మహోత్సవాలను గురువారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా గురు, శుక్రవారాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామస్తుల సమిష్టి సహకారంతో ఈ ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ ముఖ మండపం, గర్భాలయం, ఆలయ విస్తరణ పనులను చేపట్టారు. నెలలు తరబడి చేస్తున్న ఈ పనుల్లో భాగంగా చేయి తిరిగిన కళాకారులచే స్వామివారి గర్భాలయంతో పాటు మండపంలో తీర్చిదిద్దబడిన దశావతారాలు, దేవతా స్వరూపాల నడుమ వటపత్రంపై శయనించిన శ్రీకృష్ణుడు, శ్రీ అనంత పద్మనాభ స్వామివారు, శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయం, గరుత్మంతుడు, గర్భాలయం, గ్రానైట్ ఫ్లోరింగ్, వివిధ దేవతా మూర్తుల



విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. స్వామివారికి ఏటా జరిగే బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి యాత్రికులు వస్తుంటారు. టిటిడి నిధులతో స్వామివారి ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండపాన్ని నిర్మించారు.

ప్రజల క్షేమమే ప్రథమ ధ్యేయం: మేయర్

ప్రజాశక్తి-విజయవాడ : కొండ ప్రాంతాలలో నివాసం ఉంటున్న వారి కోసం విజయవాడ నగరంలో 41 పునరావాస కేంద్రాలన ఏర్పాటు చేశామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు.



మొంథా తుఫాను పరిస్థితి, విఎంసి తీసుకుంటున్న చర్యలపై ఆమె మీడియాతో మాట్లాడారు. బుధవారం లెక్కల ప్రకారం మూడు నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 349 మంది ప్రజలు పునరావాస కేంద్రాలలో బస చేస్తున్నారని అన్నారు. వర్షాలు కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలందరికీ కార్పొరేషన్ అండగా ఉంటుందని అన్నారు. భారీ వర్షాల కారణంగా కొండ ప్రాంతాల్లో నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వారి కోసం నగరపాలక సంస్థ తరపున విస్తృత స్థాయిలో పునరావాస చర్యలు చేపట్టామని వెల్లడించారు. సర్కిల్-1 పరిధిలో 15, సర్కిల్-2 పరిధిలో 16, సర్కిల్-3 పరిధిలో 10 పునరావాస కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ఈ కేంద్రాలలో ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందుబాటులో ఉంచామని తెలిపారు. బుధవారం మూడు నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 349 మంది ప్రజలు పునరావాస కేంద్రాలలో బస చేస్తున్నారని మేయర్ పేర్కొన్నారు. సర్కిల్-1 లో 178 మంది, సర్కిల్-2 లో 115 మంది, సర్కిల్-3 లో 53 మంది ఉంటున్నట్లు లెక్కలు తెలియజేశారు. ఇబ్బందులు పడుతున్న ప్రజలందరికీ కార్పొరేషన్ అండగా ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు.

తిరుమల డెయిరీ యాజమాన్య హక్కుల్లో వాటా ఇవ్వాలి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : తిరుమల డెయిరీ యాజమాన్య హక్కుల్లో తమకు వాటా ఇవ్వకుండా డెయిరీ ఎండి బత్తిని నాగేశ్వరరావు మోసం చేశారని ఆయన సోదరుడు బత్తిని ప్రభాకర్ ఆరోపంచారు. ఆస్తుల పంపకాలలో అన్యాయం జరిగిందని తెలిపారు. తిరుమల డెయిరీ నుండి రావాల్సిన షేర్లు తమకు రావడం లేదన్నారు. తమకు న్యాయం చేయాలని పోలీసులు, ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. తిరుమల డైరీలో రావాల్సిన వాటాల గురుంచి బాధిత కుటుంబ సభ్యులు బందరు రోడ్డు లబ్బీపేటలోని ఓ హోటల్లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తిరుమల డైరీ మేనేజింగ్ డైరెక్టర్ బత్తిని నాగేశ్వరావు సోదరుడు బత్తిని ప్రభాకర్ మాట్లాడుతూ 1995లో ప్రకాశం జిల్లా వెల్లల చెరువు వద్ద తిరుమల డైరీని మా నాన్న కోటేశ్వరరావు ప్రారంభించారని తెలిపారు. తాము మొత్తం 8 మంది సోదరులమని, తిరుమల డైరీ విషయంలో మా అన్న, డైరీ ఎండీ బత్తిని నాగేశ్వరరావు నలుగురు సోదరులను మోసం చేశారని ఆరోపించారు. మా అన్న పేరు మీద ట్రాన్స్‌ఫర్ అయిన డైరీ షేర్లు ఫోర్జరీ ద్వారా జరిగాయని వెల్లడించారు. మా సోదరులకు ఆస్తి సమాన భాగంగా పంపిణీ చేయలేదన్నారు. తిరుమల డైరీలో రావాల్సిన షేర్లు నలుగురు సోదరులకి దక్కలేదని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు..

అత్యాచారానికి పాల్పడిన నిందితులను శిక్షించాలి : ఐద్వా

విజయవాడ : చందర్లపాడు మండలం ముప్పాల గ్రామంలో బాలికపై జరిగిన అత్యాచార ఘటన దుర్మార్గమని, దీనిపై పోలీసు యంత్రాంగం వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని ఐద్వా ఎన్టీఆర్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం జిల్లా కార్యదర్శి కె.సరోజ బుధవారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. చందర్లపాడు ముప్పాళ్ళ గ్రామంలో కూలి పనులు చేసుకుని బతికే దళిత కుటుంబానికి చెందిన పదహారేళ్ల బాలికపై అత్యాచారం చేయటం దుర్మార్గమన్నారు. ఈ ఘటనకు పాల్పడిన వారికి కఠిన శిక్ష విధించాలని, ఇందుకు సహకరించిన వారికి కూడా శిక్ష పడాలని తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకొని, బాలికలకు రక్షణ కల్పించాలని కోరారు. అమాయకులైన దళిత కుటుంబాన్ని రోడ్డుపాలు చేయటం సమంజసం కాదన్నారు. బాలికకు కావాల్సిన వైద్య సహకారాలు ప్రభుత్వం అందించాలని కోరారు.

ముందస్తు చర్యలతోనే ముప్పును నివారించాం

• మంత్రి సత్య కుమార్ యాదవ్

ప్రజాశక్తి-విజయవాడ : ముందస్తు చర్యల వల్లే ముప్పు నివారించగలిగామని ఎన్టీఆర్ జిల్లా ఇన్చార్జి మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్లోని కమాండ్ కంట్రోల్ సెంటర్లో తుపాను సహాయక చర్యలను కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశతో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి యంత్రాంగానికి దిశా నిర్దేశం చేసి, అన్ని విధాలుగా సంసిద్ధుల్ని చేశారని చెప్పారు. ఆ సన్నద్ధత కారణంగానే తుపానును సమర్థవంతంగా ఎదుర్కొని, ఆస్తి ప్రాణ నష్టాలను నివారించగలిగామని చెప్పారు. కలెక్టర్ జి.లక్ష్మీశ అన్ని జాగ్రత్తలు తీసుకున్నారని, లోతట్టు ప్రాంతాలు, తుపాను ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారని చెప్పారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుచేసి ఏ సమస్య వచ్చినా సత్వరం పరిష్కరించగలిగేలా చూశారని చెప్పారు. బుడమేరు, ప్రకాశం బ్యారేజీలలో ఇన్ ఫ్లో తక్కువగానే ఉందని చెప్పారు. వ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు. పాము కాటు మందు సహా, అన్ని రకాల ఔషధాలను అందుబాటులో ఉంచామన్నారు. ఈ సమావేశంలో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వాన నీటి పంపుహౌజ్ పరిశీలన

విజయవాడ లోబ్రిడ్జ్ ప్రాంతంలోని వాననీటి పంపు హౌజ్‌ను మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం పరిశీలించారు. పంపుహౌజ్‌లో మోటార్ల పని తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడా నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు మోటార్లతో తోడేసినట్లు వెల్లడించారు. ప్రయాణికులు, ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక బృందాలు కీలకపాత్ర పోషించాయన్నారు. నీరు నిలిచిపోతే అంటు వ్యాధులు, విష జ్వరాలు ప్రబలే అవకాశముందని, అందువల్ల ఎక్కడా వర్షపు నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

నేటి నుంచి యథావిధిగా పాఠశాలలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : పునరావాస కేంద్రాలు ఉన్న పాఠశాలలు మినహా జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలు ఫిట్‌నెస్ ధ్రువీకరణ అనంతరం యథావిధిగా గురువారం నుంచి పని చేస్తాయని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్ అండ్ బి ఇంజనీర్లతో ఫిట్‌నెస్ ధ్రువీకరణ జరిగేలా ఎంఈవోలు, తహశీల్దార్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తరగతి గదులు, పైకప్పులు, ప్రహరీ గోడలు, విద్యుత్ కనెక్షన్లు, తాగునీరు, పారిశుధ్య సౌకర్యాలు అన్నీ సురక్షితంగా ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాతే సిబ్బందిని, విద్యార్థులను పాఠశాల భవనాల్లోకి అనుమతించడం జరుగుతుందన్నారు. పునరావాస కేంద్రాలు ఉన్న పాఠశాలలు మాత్రం అధికారుల ఆదేశాల మేరకు పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చేంత వరకు సెలవులు కొనసాగించాలని సూచించారు.

నష్టాల సత్వర అంచనాలకు డ్రోన్ సాంకేతికత : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ : జిల్లాలోని మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పంటలతో పాటు రహదారులు, వంతెనలు, ఇళ్లు తదితర మౌలిక సదుపాయాలకు సంబంధించి జరిగిన నష్టాన్ని వేగవంతంగా, కచ్చితంగా, అత్యంత పారదర్శకంగా అంచనా వేసేందుకు డ్రోన్ సాంకేతికతను వినియోగిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ కేంద్రం (సీసీసీ)లో కలెక్టర్ లక్ష్మీశ.. తుపాను నష్టాలను ప్రాథమికంగా అంచనా వేసేందుకు డ్రోన్ల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తుపాను ప్రభావిత ప్రజలకు వీలైనంత త్వరగా సహాయసహకారాలు అందించే లక్ష్యంతో నష్టాలను సత్వరం అంచనా వేసేందుకు ఆధునిక సాంకేతికత దోహదం చేస్తుందని.. జిల్లాలోని 20 మండలాల్లో నష్టాల అంచనాలకుగాను ఒక్కో మండలానికి ఒక డ్రోన్ టీమ్ పనిచేస్తోందని వివరించారు. సంప్రదాయ పద్ధతులతో పోల్చితే చాలా తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలోని ప్రాంతాల్లో డ్రోన్ సాంకేతికత ద్వారా కచ్చితమైన ఆధారాలతో నష్టాలను అంచనా వేయొచ్చన్నారు. హై రిజల్యూషన్ ఇమేజరీ, ఫుటేజీ



ద్వారా ఇది సాధ్యపడుతుందన్నారు. మనుషులు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉన్న ప్రాంతాల్లోకి సైతం డ్రోన్లను పంపి.. అక్కడి పరిస్థితిని తెలుసుకొని నష్టాన్ని విశ్లేషించేందుకు డ్రోన్లు ఉపయోగపడతాయన్నారు. డిజిటల్ మ్యాపులు, ఫొటోలు, 3డీ నమూనాల రూపంలోనూ పంట నష్టం నివేదికలను రూపొందించి పారదర్శకతను పెంపొందించవచ్చన్నారు. డ్రోన్ సాంకేతికత ద్వారా సేకరించిన డేటా ఆధారంగా పునరుద్ధరణ, పునర్నిర్మాణ పనులను సైతం సత్వరం చేపట్టేందుకు వీలుంటుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ప్రజలకు అవసరమైన సహాయాన్ని త్వరగా, సమర్థవంతంగా అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నాలకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఎన్‌టిఆర్ జిల్లాలో కుండపోత

• పశ్చిమ నియోజకవర్గంలో అత్యధికం
• నందిగామలో అత్యల్పం

ప్రజాశక్తి-విజయవాడ : విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో అత్యధిక వర్షపాతం నమోదు అయింది. మొంథా తుఫాను కారణంగా ఎన్‌టిఆర్ జిల్లాలో భారీ వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు వర్షం కురవగా, బుధవారం మధ్యాహ్నం వరకు కూడా జిల్లాలో అడపాదడపా తేలికపాటి వర్షం కురుస్తూనే ఉంది. జిల్లాలో సగటున 32.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, 639.6 మి.మీ. జిల్లాలో వర్షపాతం నమోదైంది. మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి బుధవారం ఉదయం 7 గంటల మధ్యలో జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాల ప్రకారం.. జిల్లాలోని విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో అత్యధికంగా 58.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే నందిగామ మండంలో 13.8 మిల్లీ మీటర్ల అత్యల్ప వర్షపాతం నమోదు అయింది. వత్సవాయి మండలంలో 35.7 మి.మీ, జగ్గయ్యపేటలో 41.5, పెనుగంచిప్రోలు 27.9, వీరులపాడు 20.0, మైలవరం 28.4, గంపలగూడెం 36.4, తిరువూరు 25.8, ఎ కొండూరు 23.4, రెడ్డిగూడెం 36.9, విసన్నపేట 29.9, జి కొండూరు 51.3, కంచకచర్ల 29.4, చందర్లపాడు 32.8, ఇబ్రహీంపట్నం 31.5, విజయవాడ సెంట్రల్ 30.4, విజయవాడ రూరల్ 24.4, విజయవాడ ఈస్ట్ 29.7, విజయవాడ నార్త్ మండలంలో 30.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం బుధవారం వెల్లడించింది.



దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : రాష్ట్ర హైకోర్టు నూతన న్యాయమూర్తి సుభేందు సమేంత దంపతులు విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. బుధవారం ఇంద్రకీలాద్రికి విచ్చేసిన న్యాయమూర్తికి దేవస్థానం అధికారులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశీర్వచన మండపంలో ఆలయ పండితులు జస్టిస్ సుభేందు సమేంత దంపతులకు అమ్మవారి వేద ఆశీర్వచనం అందజేయగా, దేవస్థానం అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు బహూకరించారు.

1న ఎన్‌టిఆర్ వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 39వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను నవంబర్ 1న వర్సిటీ క్యాంపస్‌లోని ఆలోచనా హాల్‌లో నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ఉప కులపతి డాక్టర్ పి. చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్శిటీ వ్యవస్థాపక దినోత్సవానికి ముఖ్య అతిథిగా వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సౌరవ్ గౌర్ హాజరవుతున్నారన్నారు. గౌరవ అతిథులుగా ఉన్నత విద్యా శాఖ చైర్మన్ కె.మధుమూర్తి, ఆయుష్ శాఖ సంచాలకులు దినేష్ కుమార్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జి.రఘునందన్ హాజరవుతారని తెలిపారు.

కొండ ప్రాంతాల్లో పర్యటన

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : పశ్చిమ ప్రాంతంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను తహశీల్దార్ షేక్ ఇంతియాజ్ పాషా బుధవారం పరిశీలించారు. అక్కడున్న వారికి మౌలిక వసతులు, సౌకర్యాలు అందే విధంగా చర్యలు చేపట్టారు. కొత్తపేట కొండపై, శ్రీనివాస్ మహల్ వెనుక కొండ ప్రాంతంలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. వర్షాలకు కొండ రాళ్లు జారిపడే అవకాశం ఉందని, పునరావాస కేంద్రానికి వెళ్లాలని మైక్‌లో ప్రచారం చేశారు.



నీట మునిగిన పలు కాలనీలు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : మొంథా తీవ్ర తుపానుకు విజయవాడ నగరం తడిసి ముద్దయ్యింది. మంగళవారం అర్ధరాత్రి సమయంలో కురిసిన భారీ వర్షానికి నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు కాలనీలు, ప్రధాన రహదారులు కాలవలను తలపించాయి. పశ్చిమ నియోజకవర్గంలోని పాతబస్తీ, కబేల పాత హెచ్‌పి కాలనీ, ఇందిరా ప్రియదర్శిని కాలనీ నీట మునిగాయి. కొన్ని ప్రాంతాల్లో వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఈదురు గాలులకు చెట్లు విరిగి రోడ్లపై పడటంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థతలు పడ్డారు. మున్సిపల్ సిబ్బంది స్పందించి విరిగి పడిన చెట్లను తొలగించారు. నీట మునిగిన కాలనీలలో వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని తొలగించారు. విద్యాధరపురం ఆర్టీసీ డిపో ప్రాంగణంలోకి భారీగా వర్షపు నీరు చేరడంతో సిబ్బంది బస్సులు బయటకు తీసేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.